VISION BHARATH REPORTER
విభారే
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారే" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శుక్రవారం 30-06-2023 | సంపుటి : 04 | సంచిక : 264 | పేజీలు : 8 | వెల : రూ 3-00

## టిడిపి హయాంలో 8 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం

**అధికారంలోకి రాగానే మళ్లీ జాబ్క్యాలెండర్ ప్రకటిస్తాం**

**యువతతో ముఖాముఖి కార్యక్రమంలో లోకేశ్ వెల్లడి**



నెల్లూరు,జూన్29 : టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 8 లక్షల ఉద్యోగాలు ఇచ్చిందని, మళ్లీ అధికారంలోకి రాగానే జాబ్ కాలెండర్ తెస్తామని టీడీపీ యువనేత నారా లోకేష్ స్పష్టం చేశారు. అధికారంలోకి రాగానే కంపెనీలు తీసుకొస్తామని, వాటి ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. నెల్లూరు జిల్లాలో యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్న ఆయన యువతతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ విద్యలో పాత విధానాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ హయాంలో చాలా డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలు ఉండేవని.. ఇపుడు అన్ని మూసేసారని.. అవన్నీ మరలా తీసుకొస్తామన్నారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న కంపెనీలను వేరే రాష్ట్రాలకి వెళ్లేలా చేస్తోందని, అలాంటి పరిస్థితి రానివ్వకుండా చేస్తామని నారా లోకేష్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజలను నిత్యావసర రేట్లు పెంచి పీడిస్తున్న విధానాన్ని మారుస్తామని, ఆన్ లైన్ బెట్టింగ్ యాప్ లను నిషేదిస్తామని, యువత తప్పుదోవ పట్టకుండా చూస్తామని అన్నారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యలో సమూల మార్పులు తీసుకొస్తామని, మొదటి 100 రోజుల్లో 77జీవోను రద్దు చేస్తామని, పాత పద్దతిలో ఫీజు రియంబర్స్‌మెంట్ తీసుకొస్తామన్నారు. అధికారంలోకి రాగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరులో కలుపుతామన్నారు. మేనమామ (జగన్) విద్యార్థులకు ఇపుడు కంసుమామలాగా మారిపోయారని విమర్శించారు. విద్యార్థులకు అందరికీ ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. స్వంత జిల్లా కోసం ఒక్క కంపెనీ సీఎం జగన్ తెచ్చారా?.. కడప జిల్లాకు ఒక కాన్సర్ గడ్డలాగా మారిపోయానని లోకేష్ దుయ్యబట్టారు. కోవిడ్ వారియర్స్ పేరుతో ఎంతో మందికి ఉద్యోగం కల్పించి ఇపుడు నడి రోడ్డులో వదిలేసారన్నారు. విదేశీవిద్యని తీసుకొస్తే, ఇపుడు జగన్ అదికూడా లేకుండా చేశారని, టీడీపీ ప్రభుత్వం రాగానే విదేశీవిద్య కార్యక్రమాన్ని తీసుకొస్తామన్నారు. ఏపీకి

# రానున్న ఎన్నికలు లక్ష్యంగా మోడీ వ్యూహాలు




**పార్టీని విజయతీరాలకు చేర్చేలా కీలక నిర్ణయాలు**

**ఆయా రాష్ట్రాల్లో గగెలుపు లక్ష్యంగా ప్రణాళికలు**

**అర్ధరాత్రి నడ్డా, అమిత్ షాలతో అంతరంగిక చర్చలు**

న్యూఢిల్లీ,జూన్ 29 : రానున్న లోక్‌సభ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీని సమరోత్సాహంతో ముందుకు నడిపేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సన్నాహాలు చేస్తున్నారు. ఆయన ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలతో బుధవారం రాత్రి చర్చలు జరిపారు. కేంద్ర మంత్రివర్గంలోనూ, పార్టీ సంస్థాగత విభాగాల్లోనూ మార్పులు, చేర్పులు జరగబోతున్నాయనే ఊహాగానాల నడుమ ఈ చర్చలు జరిగాయి. ఈ ఏడాది చివరిలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ తదితర రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు జరగబోతున్నాయి. అదే విధంగా 2024లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయి. ఈ అన్ని ఎన్నికల్లో పార్టీ సర్వసన్నద్ధంగా, సమరోత్సాహంతో దూసుకెళ్లాలనే లక్ష్యంతో ప్రభుత్వంలోనూ, జాతీయ, రాష్ట్ర స్థాయిల్లోనూ మార్పులు జరగబోతున్నాయని కొన్ని రోజుల నుంచి ఊహాగానాలు ప్రచారమవు తున్నాయి. మోదీ అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకుని, తిరిగి వచ్చిన వెంటనే పార్టీ పట్ల దృష్టి సారించారు. మోదీ మంగళ వారం మధ్య ప్రదేశ్‌లోని భోపాల్‌లో వందే భారత్ రైళ్లను ప్రారంభించిన అనంతరం బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఉమ్మడి పౌర స్మృతి అవసరం చాలా ఉందని నొక్కి చెప్పారు. బీజేపీ ఎన్నికల ప్రణాళికలో దీని గురించి ప్రస్తావించిన సంగతి తెలిసిందే. 2024 లోక్‌సభ ఎన్నికలతో పాటు రాబోయే పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా బీజేపీ ప్రణాళికను సిద్ధం చేసింది. మైక్రో మేనేజ్‌మెంట్ కోసం మెగా ప్లాన్ సిద్ధం చేసింది. పార్టీ పనితీరును సరళీకృతం చేయడానికి బీజేపీ మొదటిసారిగా దేశాన్ని మూడు విభాగాలుగా విభజించింది. ఇందుకోసం బీజేపీ ఉత్తర ప్రాంతం, దక్షిణ ప్రాంతం, తూర్పు ప్రాంతాన్ని నిర్ణయించింది. జులై 6, 7, 8 తేదీల్లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో పార్టీ నేతలతో బీజేపీ అధ్యక్షుడు జేపి నడ్డా సమావేశం కాబోతున్నారు. ఈక్రమంలోనే జులై 6వ తేదీన ఈస్ట్ రీజియన్, 7న నార్త్ రీజియన్, 8న సౌత్ రీజియన్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మండల, రాష్ట్ర ఇంఛార్జీలతోపాటు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక మంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, జాతీయ కార్యవర్గ సభ్యులు హాజరవుతారని బీజేపీ నాయకులు చెబుతున్నారు. జులై 6వ తేదీన గౌహతిలో ఈస్ట్ రీజియన్ సమావేశం జరగనుంది. ఇందులో బిహార్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, అసోం, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల నుంచి పార్టీతో సంబంధం ఉన్న వ్యక్తులు సమావేశంలో పాల్గొంటారు. జులై 7వ తేదీన ఢిల్లీలో ఉత్తర ప్రాంత సమావేశం జరగనుంది. ఇందులో జమ్ము-కశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, చండీగఢ్, రాజస్థాన్, గుజరాత్, డామన్ దయ్యూ-దాదర్ నగర్ హవేలీ, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, హర్యానాకు చెందిన బీజేపీ నేతలు పాల్గొంటారు. జులై 8వ తేదీన హైదరాబాద్‌లో సౌత్ రీజియన్ సమావేశం జరగనుంది. ఇందులో కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ముంబై, గోవా, అండమాన్ నికోబార్, లక్షద్వీప్ పార్టీల అధికారులతో చర్చలు జరుపుతారు. ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో బీజేపీ భేటీలో 2023 చివరలో జరగనున్న మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలపై చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీజేపీ ఆర్గనైజేషన్ లీడర్ బీఎల్ సంతోష్ పాల్గొన్నారు. అయితే సంస్థలో పునర్వ్యవస్థీకరణకు సంబంధించి మేధోమథనం తర్వాత ప్రధాని మోదీతో ఈ సమావేశం జరిగిందని, ఇలాంటి పరిస్థితిలో పార్టీలో చాలా మార్పులు జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# పవన్ నిలకడ లేని మనిషి



**యువతను రెచ్చగొట్టే ప్రసంగాలు**

**యువత జాగ్రత్తగా ఉండాలన్న అంబటి**

**లయువగళానికి గళం లేదని విమర్శలు**

**కన్నా టిడిపిలో ఉంటాడో లేదో తేల్చుకోవాలి**

**టిడిపి బస్సు యాత్ర..తుస్సు యాత్ర అన్న రాంబాబు**

పల్నాడు,జూన్29 : తన ఆవేశంతో ప్రజల్ని రెచ్చగొడుతున్నారని, ఆయన నిలకడ లేని వ్యక్తి అని మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. అలాంటి వ్యక్తికి యువత మద్దతు పలకవద్దని పిలుపు ఇచ్చారు. జగన్మోహన్ రెడ్డిని అధికారం నుంచి దింపి మరెవరికో ఇవ్వాలని పవన్ అంటున్నారని విమర్శిం చారు. అంబటి రాంబాబు గురువారం మీడియాతో మాట్లాడుతూ పవన్ తీరును ఘాటుగగా విమర్శించారు. టీడీపీ బస్సు యాత్ర గురించి మాట్లాడుతూ.. అది తుస్సు యాత్ర అని కొట్టిపారేశారు. అక్కడ జనాలు లేరని, కనీసం టీడీపీ కార్యకర్తలు కూడా బస్సు యాత్రకు రాలేదని ఎద్దేవా చేశారు. కన్నా లక్ష్మీ నారాయణ విసిరిన సెల్ఫీ ఛాలెంజ్ ను కూడా ఎద్దేవా చేశారు. అసలు ఆయన టీడీపీలో ఉంటారో లేదో డౌట్ అని, అసలు ఛాలెంజ్ లు చేసే అర్హత అనేది ఆయనకు లేదని స్పష్టం చేశారు. సత్తెనపల్లికి టీడీపీ ఇన్‌ఛార్జి అయిన కన్నా లక్ష్మీ నారాయణకు తాను మూడు సవాళ్లు విసురుతున్నానని అన్నారు. వంగవీటి మోహన రంగారావుని హతమార్చింది ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ విషయం తెలిసి కూడా చెప్పకపోతే నీ రాజకీయ భవిష్యత్తు సున్నా అవుతుందని అన్నారు. నిన్ను చంపడానికి ప్రయత్నించింది ఎవరో కూడా చెప్పాలని సవాలు విసిరారు. చివరిదాకా చంద్రన్న వెంట ఉంటావా? లేక పారిపోతావా అని ప్రశ్నించారు. పైగా అసలు సత్తెనపల్లిలో చివరిదాకా ఉండి పోటీ చేస్తావా? లేక పారిపోతావా? అని నిలదీశారు. ముందు వీటికి సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. యువగళానికి గళమే లేదని, లోకేశ్ ఒక మాట చెప్పబోయి మరో మాట చెబుతున్నాడని అన్నారు. ఏపీలో మళ్లీమళ్లీ జగన్మోహన్ రెడ్డి సీఎం అవుతారని, ఆ విషయం అర్థమైపోయి ఊగిపోతూ మాట్లాడుతున్నారని అన్నారు. మంచి నాయకుడి మీద విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. తాను ఓడిపోయిన సందర్భంలో చాలా బాధ పడ్డానని ఇప్పుడు చెబుతున్నారని, గతంలో తాను ఓటమిని లెక్కచేయబోనని అన్నారని గుర్తుచేశారు. ఈయన మాట మీద నిలబడే వ్యక్తి కాదని ఎద్దేవా చేశారు. పవన్ ని నమ్ముకొని రాజకీయాలు చేస్తే అందరూ నష్టపోతారని అన్నారు. పవన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. వారాహి అంటే అమ్మ వారి పేరు. అమ్మవారి పేరు పెట్టుకుని వాహనం పైకి ఎక్కి మాట్లాడటం సరికాదన్నారు. పవన్ చేసే ప్రతి పనికి ఒక కథ ఉంది. సినిమాలో పవన్ కథానాయకుడు. రాజకీయల్లో కంత్రీ నాయకుడు. పవన్ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు. పవన్ రాజకీయాలకు అన్వరుడు. రాజకీయాల్లో చంద్రబాబుకు పవన్ డబ్బింగ్ చెబుతున్నారు. లోకేష్ యువగళానికి అసలు గళం లేదు. టీడీపీది బస్సు యాత్ర కాదు.. అది తుస్సు యాత్ర అంటూ విమర్శలు చేశారు. అంతకుముందు అంబటి రాంబాబు బక్రీద్ పండుగ సందర్భంగా ప్రార్థనల్లో పాల్గొన్నారు. మనోవాంఛ, స్వార్థం, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవతను వెదజల్లాలన్నదే బక్రీద్ పండుగలో ఆంతర్యమని మంత్రి అంబటి రాంబాబు అన్నారు.

## ఓటమి భయంతోనే ఓట్ల తొలగింపు

**వైసిపి తీరును విమర్శించిన బాబు**



అమరావతి,జూన్29 : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసీపీ అక్రమంగా ఓట్లను తొలగిస్తోందని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆరోపించారు. ఓటరు జాబితా అక్రమాలపై నిరంతర పోరాటం చేయాలని, ఏపీలో దొంగ ఓట్ల నమోదు, టీడీపీ అనుకూల ఓట్ల తొలగింపు అంశాలను సీరియస్?గా తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. ఉద్దేశ పూర్వకంగా ఎవరు తప్పులు చేసినా వదిలే ప్రసక్తే లేదని చంద్రబాబు హెచ్చరించారు. ఓటర్ల జాబితాలో అవకతవకలపై నేతలతో చంద్రబాబు చర్చించారు. ఇప్పటివరకు పార్టీ యంత్రాంగం గుర్తించిన అవకతవకలను నేతలు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ పరంగా చేపట్టిన ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం ద్వారా 20 లక్షల దొంగ ఓట్లు ఉన్నట్లు గుర్తించామని టీడీపీ నేతలు చెప్పారు. పార్టీ పరంగా స్పెషల్ డ్రైవ్ పెట్టి ఓటర్ల జాబితాలో అవకతవకలపై మరిన్ని ఆధారాలు సేకరించాలని చంద్రబాబు తెలిపారు. టీడీపీ ముఖ్యనేతలతో చంద్రబాబు సమావేశం అయ్యారు.

# ఇచ్చిన హామీలు గాలికొదిలేసి అబద్దాల ప్రచారం

**99శాతం అమలు చేశామంటూ గొప్పలు**

**పదిశాతం కూడా అమలుకు నోచుకోలేదు**

**జగన్ గాలికి వదిలేసిన హామీలంటూ టిడిపి పుస్తకం**

అమరావతి,జూన్ 29: ఇచ్చిన హామీలు గాలికి వదిలేసిన సిఎం జగన్ అంటూ టిడిపి మండిపడింది. 99శాతం నెరవేర్చామంటూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించింది. చెప్పిన మేరకు చేయని హామీలు 39 ఉన్నాయంటూ గురువారం టీడీపీ ఓ పుస్తకాన్ని విడుదల చేసింది. ప్రకాశించని నవరత్నాలు... జగన్ రెడ్డి మోసపు లీలలు పేరుతో తెలుగుదేశం వాస్తవ పత్రాన్ని విడుదల చేసింది. నవరత్నాల పేరుతో సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు తొమ్మిదైతే... వాటికింద 40 హామీలు ఉన్నాయని తెలుగుదేశం పార్టీ పేర్కొంది. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేశామంటూ వైసీపీ చేస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన హామీలు 10 శాతం మాత్రమే అని.. తప్పుడు ప్రచారంతో ప్రజల్ని మోసగిస్తున్నారని మండిపడ్డారు. రైతు భరోసా కింద రూ.13500 ఇస్తానని చెప్పి ఇచ్చేది రూ.7500 మాత్రమే అని తెలిపారు. రైతు భరోసా కింద 12 హామీలు ఇస్తే ఒక్కటీ అమలు కాలేదని మండిపడ్డారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఇచ్చిన 8 హామీల్లో 8 అమలుకాలేదని అన్నారు. ఫించన్ల పెంపు కింద ఇచ్చిన మూడు హామీల్లో రెండు అమలుకాలేదని తెలిపారు. అలాగే అమ్మఒడి కింద ఇచ్చిన రెండు హామీల్లో రెండూ అమలు కాలేదని.. పేదలందరికీ ఇళ్లు పేరిట ఇచ్చిన ఐదు హామీల్లో ఒక్కటీ అమలు కాలేదన్నారు. బోధనా రుసుము చెల్లింపు కింద ఇచ్చిన రెండు హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. వైఎస్సార్ జలయజ్ఞం కింద ఇచ్చిన మూడు హామీలకు మూడూ పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. మద్యనిషేధం అంటూ ఇచ్చిన ఒక్క హామీ ఇంతవరకు అమలుకాలేదన్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూతల కింద ఇచ్చిన నాలుగు హామీల్లో నాలుగు పెండింగ్‌లోనే ఉన్నాయని అచ్చెన్నాయుడు చెప్పు కొచ్చారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ.. మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులు లేనందుకు ప్రభుత్వంపై కేసులు నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలో దొరికే నాసిరకం మద్యాన్ని అధికారపార్టీ ఎమ్మెల్యేలు తాగగగలరా అటూ ప్రశ్నించారు. బోండా ఉమా మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి పాలనలో



6093 ఖైదీలు కాగలరు కానీ సత్య నాదెండ్లలు కాలేరని వ్యాఖ్యలు చేశారు. ఎవరికో పుట్టిన బిడ్డకు తన పేరు పెట్టుకున్నట్లుగా టిడ్కో ఇళ్లపై ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు.

## ఇందిరాగాంధీ స్టేడియంలో బక్రీద్ వేడుకలు

విజయవాడ: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో బక్రీద్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో పాటు ప్రార్థనల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణ కూడా పాల్గొన్నారు. ఈ క్రమంలో ముస్లిం సోదరులు



మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సుఖ సంతోషాల పాలన నడుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు చాలా గొప్ప సేవలు అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణ మాట్లాడుతూ.. ప్రేమ, త్యాగాలకు ప్రతీక బక్రీద్. ముస్లిం సోదరులు ప్రార్థనలు చేసుకునేందుకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. చంద్రబాబు హయాంలో మైనార్టీలకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదు. వైఎస్సార్ తర్వాత ముస్లింలకు మేలు చేస్తున్నది సీఎం జగన్ మాత్రమే.

# సంపాదకీయం

శుక్రవారం 30-06-2023

## ఉపాధి రంగాలను ప్రోత్సహించాలి !

మూడేళ్ల క్రితం భారతదేశంలో కరోనా వ్యాప్తి, మరణాల సంఖ్య కారణంగా ప్రజల ఆర్థికస్థితి చితికిపోయింది. పేదలు మరింత పేదలుగా మారారు. అలాగే మధ్య తరగతి ప్రజలు మరింతగా దెబ్బతిన్నారు. ఈ క్రమంలో కరోనా దెబ్బనుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నారు. పరిస్థితులు ఆర్థికంగా అనుకూలంగాలేకున్నా నిలదొక్కుకునే ప్రయత్నంలో నిమగ్నం అయ్యారు. ధరల దాడిని ఎదుర్కొంటూ మళ్లీ సాధారణ జీవితంలోకి ఒదిగిపోతున్న వేళ దేశంలో ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు గుదిబండగా మారుతు న్నాయి. రూపాయి విలువ రోజురోజుకూ పతనం అవుతోంది. దీంతో విదేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులు, ఉద్యోగార్థులకు తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయి. దేశంలో ఆర్థిక దుస్థితిని పరిశీలించి అడ్డుకట్ట వేసే చర్యలు కానరావడం లేదు. నిత్యావసర, కూరగాయల ధరలు మోత మోగిస్తున్నాయి. సగటు కుటుంబానికి నెలకు 50వేలు లేనిదే గడవలేని దుస్థితి నెలకొంది. జీఎస్టీలు తగ్గించడం, ఇన్‌కమ్ టాక్స్ పరిమితి పెంచడం,ఉపాధి రంగాలను బలోపేతం చేయడం,వస్తూత్పత్తి పెంచడం వంటి అత్యవసర చర్యలపై కేంద్ర,రాష్ట్రాలు దృష్టి సారించడం లేదు. ఆర్థికంగా దేశాన్ని బలోపేతం చేసే చర్యలపై మోడీ ప్రభుత్వం పెద్దగా పట్టించుకోవడం లేదు. కార్పోరేట్లకు అండగా నిలవడం తప్ప ప్రజలకు అండగా ఉండే చర్యలు కానరావడం లేదు. ప్రజలను కష్టాల కొలిమిలోంచి బయటపడేసే చర్యలు కానరావడం లేదు. ముమ్మందు కరోనాను మించిన ఉపద్రవం ఉందని ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. అయినా ప్రజలు బెదరడం లేదు. ఉంటే ఉంటాం.. పోతే పోతాం అన్న ధోరణిలో జీవితంతో పోరాడుతున్నారు. ఎవరికి వారు పొట్టకూటి కోసం పడరాని తిప్పలు పడుతున్నారు. కాయకష్టం చేసుకునే వారికి ఢోకా లేకున్నా ఉపాధి, ఉద్యోగ రంగాలు మాత్రం వెక్కిరిస్తు న్నాయి. దెబ్బతిన్న రంగాలను గుర్తించి వారిని ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. ప్రధానంగా లోయర్ మిడిల్ క్లాస్ వాళ్లు బాగా దెబ్బతిన్నారు. ఉద్యోగాలు పోయాయి. ఉపాధి దొరకడం లేదు. ఈ వర్గాలను గుర్తించి వారిని నేరుగా ఆదుకునే చర్యలకు ఉపక్రమించాలి. గతంలో ప్రకటించిన ఆత్మనిర్భర భారత్ ఎవరికి మేలు చేసిందో తెలియదు. పోనీ ఎవరైనా గట్టిగా మాకు ఈ మేలు జరిగిందని చెప్పడం లేదు. నిజానికి సర్వే జరిపించి ఉపాధి, ఉద్యోగాలు కోల్పోయిన వారిని గుర్తించి నేరుగా నగదు బదిలీ పథకం లాంటి చేపడితేనే ప్రజలు మళ్లీ నిలదొక్కుగోలరు. అలాగే బ్యాంకులు ఉదారంగా తక్కు వడ్డీలకు రుణాలు ఇచ్చేలా చూడాలి. చిన్నా చితకా వ్యాపారాలు చేసుకునే వారికి కనీసం కోటి వరకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలు ఇవ్వగలగాలి. అప్పుడే గ్రామీణ ఆర్థికరంగం బలోపేతం అవుతుంది. ఆత్మనిర్భర భారత్‌తో పాటు ఇప్పటికే ప్రకటించిన ప్యాకేజీలు ఏవీ కూడా సామాన్యులకు దోహదపడవని అర్థం అవుతోంది. సామాన్యులకు మేలు చేసేలా పథకరచన సాగడం లేదు. వ్యక్తులు లేదా కుటంబాలను ఆదుకోవడానికి ఏదో రకమైన వెసలుబాటు ఉండాలి. ఎవిరికి వారు కోలుకోవాలంటే ఇప్పటికిప్పుడు సాధ్యం అయ్యేలా లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉన్నది. ఆర్థిక భయం కూడా మధ్యతరగతి వారిని వేధిస్తున్నది. ఈ కష్టాల కొలిమిలోంచి ప్రజలు బయటపడేందుకు వ్యక్తిగత ప్రయోజనాలు సమకూర్చాలి. అప్పుడు దేశీయ ఆర్థికరంగం బలోపేతం కాగలదు. బ్యాంకులను అందుకు సన్నద్ధం చేయాలి. అసత్యాలు, అర్థసత్యాలతో ఎప్పటికప్పుడు నెట్టుకురావడం కాక, ప్రజల మనసుల్లో రక్షకులుగా చిరస్థాయిగా నిలిచి పోయేందుకు పాలకులు కృషి చేయాలి. అలాగే ఆర్థికంగా అతిపెద్ద చర్యలకు ఉపక్రమించాలి. ప్రధానంగా ఉపాధిరంగాలను విపరీతంగా ప్రోత్సహించాలి. ప్రజలకు అవసరమైతే వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. చిన్నాచి తకా వ్యాపారాలు, ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహకాలు ఇవ్వనతవరకు దేశ అర్థికస్థితి కుదుటపడదనిగుర్తించాలి. కుదేలవుతున్న రూపాయిని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు కూడా తీసుకోవాలి. చిన్నతరహా పెట్టుబడులతో ఉపాధి అవకాశాలు పెంచుకునేలా బ్యాంకులక స్వేచ్ఛను ఇవ్వాలి. గ్రామీణ ఆర్థికరంగ పురోగామికి తోడ్పడే రంగాల్లో పెట్టుబడులకు అవకాశం ఇవ్వాలి. కులవృత్తులను ప్రోత్సహించాలి. పాడిరంగాన్ని బలోపేతం చేయాలి. కోళ్లు, పశువుల పెంపకం వంటివి విరివిగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా ఉపాధి, ఉద్యోగ రంగాలను బలోపేతం చేస్తే తప్ప ప్రజలకు జీవనభృతి దక్కదు. దేశంలో దెబ్బతిన్న రంగాలను గుర్తించి ఆదుకోవాలి. ప్రజలకు బతుకలు భారం కాకుండా నిర్ణయాలు తీసుకోవాలి. అందుకు భారీ ప్రణాళికలు చేపట్టాలి. నిర్మాణరంగంలో ఉపాధి అవకాశాలను పెంచాలి. వ్యవసాయరంగంతో పాటు, అనుబంధరంగాలను ప్రోత్సహించాలి. పనులు చేసుకునేలా, ధాన్యం దిగుబడులు పెరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు, దిగుమతులపై ఆంక్షలు విధించాలి. దేవీయంగగా వస్తు వినయోగాన్ని పెంచుకునేలా చైతన్యం తీసుకు రావాలి. అప్పుడే ఉపశమనం లభించగలదు. మెడిసిన్ ధరలతో పాటు ఇతర వస్తువుల ధరలు పెరగకుండా అదుపు చేయగలగాలి. ఇలా ఒక్కోరంగాన్ని ఎంచుకుని దానిని బలోపేతం చేస్తూ పోతే కొంతయినా ఫలితం లభించగలదు.

# తొలి ఏకాదశి మరియు బక్రీద్ పర్వదినాలను పురస్కరించుకుని జిల్లాలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు...

- సర్వమత సమ్మేళనమైన మన భారతదేశంలో అన్ని మతాల, కులాల ఆచార సంప్రదాయాలను ఒకరినొకరు గౌరవించుకోవాలి......
- ఎవరైనా మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము...
- సోషల్ మీడియా పై నిరంతర నిఘా ఏర్పాటు చేశాము:
- జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీర్ రెడ్డి ఐపిఎస్...





నంద్యాల జూన్ 29 జిల్లా ఎస్పీ శ్రీ కె. రఘువీరా రెడ్డి ఐపిఎస్ నంద్యాల పట్టణంలో తొలి ఏకాదశి మరియు బక్రీద్ పండుగలను పురస్కరించుకొని బందోబస్తు విధులను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బొమ్మలసత్రం వద్దగల ఈద్గ ,భీమవరం రోడ్డు వద్దగల ఈద్గ మరియు పలు పికెట్ లను పరిశీలించారు. అనంతరం భీమవరం రోడ్డు వద్ద గల ఈద్గలో జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషతో కలిసి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారిచే ఏర్పాటు చేసిన రక్తదాన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొన్నారు.తొలి ఏకాదశి మరియు బక్రీద్ పర్వదినాలను పురస్కరించుకొని జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో పండుగలు జరుపుకొావాలని జిల్లా ప్రజలకు నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీర్ రెడ్డి తొలి ఏకాదశి మరియు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీరారెడ్డి ఐపిఎస్ మాట్లాడుతూ తొలి






ఏకాదశి మరియు బక్రీద్ పర్వదినాలను పురస్కరించుకొని భక్తులు ప్రశాంత వాతావరణములో ప్రార్థనలు నిర్వహించుకోవడానికి జిల్లా వ్యాప్తంగా అన్ని దేవాలయాలు, మసీదులు మరియు ప్రార్ధన స్థలాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాన్నామన్నారు. సర్వమత సమ్మేళనమైన మన భారతదేశంలో అన్ని మతాలు, కులాల ఆచార సంప్రదాయాలును గౌరవించడం మనందరి బాధ్యతని జిల్లా ఎస్పీ శ్రీ రఘువీరారెడ్డి తెలిపారు. హిందువులకు పవిత్రమైన తొలి ఏకాదశి, ముస్లింలకు పర్వదినమైన బక్రీద్ పండుగలు రెండు ఒకే రోజున ఉన్నందున ప్రజలందరూ శాంతియుత వాతావరణములో తమ ఇష్టదైవాలను ఆరాధించుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీరారెడ్డి తెలిపారు. ఈ విధంగా ప్రశాంత వాతావర్ణంలో పండుగలు జరుపుకోవడానికి ఒక వారం రోజుల కృషి

ఉందని ప్రజలంతా సహకరించారని,పట్టణంలో ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకున్నామని ఈ విదంగా అందరు కలసి మతసామరస్యంతో పండుగలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఎవరైనా తమ స్వార్థ ప్రయోజనాలకోనం మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియా వేదికగా పోస్టులు చేసిన,(లేదా)వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, సోషల్ మీడియాపై నిరంతర నిఘా ఉంటుందన్నారు.తద్వారా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తావులేకుండా నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు.

# చంద్రశేఖర్ ఆజాది రావణ్ దాడి ని తీవ్రంగా ఖండించిన మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు సి. రంగయ్య



ఎమ్మిగనూరు:-భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ రావణ్ పై కాల్పుల దాడి పిరికిపందల చర్య అనిజిల్లా నాయకులు మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రిక సమావేశం లో ఉత్తరప్రదేశ్ లోని భీమ్ ఆర్మీ చీఫ్ పై దుండగులు కాల్పులు జరపడం యావత్ భారతదేశాన్నిగ్భ్రాంతి కి గురిచేసిందని మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు సి. రంగయ్య పత్రిక సమావేశంలో తెలిపారు.మతోన్మాదం బుసలు కొడుతున్న ఉత్తరప్రదేశ్ లో రాజ్యాంగ హక్కులను పరిరక్షించడానికి, కుల అణచివేతను వ్యతిరేకించడానికి 2015లో భీమ్ ఆర్మీని స్థాపించారు.ఈ సంస్థ కు నాయకుడైన చంద్రశేఖర్ ఆజాద్ అనతికాలంలోనే దళితులను, బహుజనులను సంఘటిత పరిచి ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రత్యర్థిగా మారాడని అధికార బీజేపీ తప్పుడు కేసులు బనాయించీ జైల్లో నిర్బంధినప్పటికీ వెన్నుచూపని ధైర్యం అతనిదని ఆజాద్ పై జరిపిన కాల్పుల వెనుక అధికార పార్టీ ల హస్తం తప్పకుండ ఉంటుందని చంద్రశేఖర్ ఆజాద్ రావణ్ ని చంపితే వేలమంది చంద్రశేఖర్ ఆజాద్ లు పుట్టుకొస్తారని హెచ్చరించారు. జిల్లా నాయకులు మల్లేష్ మాట్లాడుతూ ఈ దాడిని బట్టి దళితుల మీద దళిత నాయకుల మీద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు బట్టబయలు అయ్యాయి అని తెలిపారు.ఈ దాడి మీద అన్ని రాజకీయ ప్రతిపక్ష పార్టీ లు ప్రజా సంఘాలు కుల,విద్యార్థి సంఘాలు వామపక్షాలు అందరు కలిసి త్వరలో నిర్ణయం తీసుకుని భారత్ బంద్ పిలుపు ఇచ్చే దిశగా అడుగులు వేసి న్యాయం జరిగే వరకు అన్ని రాష్ట్రాలలో పోరాటం ఆగదని తెలిపారు. చంద్రశేఖర్ ఆజాది కి జరగరానిది ఏమైనా జరిగితే మాత్రం ఆపై జరిగే పరిణామాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం భాధ్యత వహించాలని హెచ్చరించారు. వచ్చే ఎన్నికలలో మీ అంతు చూడటానికి ప్రతీ రాష్ట్రంలో దళితులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.దోషులని పట్టుకోవడంలో న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే మాత్రం దేశం లో ధర్నాలు రాస్తారోకోలతో అట్టడుకుతుందని దేశంలో ప్రతీ రాష్ట్రం లో లక్షల మంది చంద్రశేఖర్ ఆజాది రావణ్ లు ఉన్నారని అది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిలో పెట్టుకోవాలని తెలిపారు. ఈ దాడిపై తరువాత కార్యాచరణ కు పై చర్చకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకుల నుండి ఆహ్వానం అందిందని కార్యాచరణ మేరకే ముందుకు వెళతాం అని మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు సి. రంగయ్య తెలిపారు.కార్యక్రమంలో వివిధ గ్రామాల మాలలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి 53వ జన్మదిన శుభాకాంక్షలు

**- బిసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థి సంఘం నాయకులు వంకిరి**

రామచంద్రుడు నంద్యాల జూన్ 29 సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి 53వ జన్మదిన సందర్భంగా బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ,విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు యువ న్యాయవాది వంకిరి రామచంద్రుడు మరియు ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ రాష్ట్ర నాయకులు వేణుమాధవ్ రెడ్డి తాతిరెడ్డి తులసిరెడ్డికి పూల మాలలు వేసి పూల బొకేతో ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల మనిషిగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ న్యాయవాద వృత్తిలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా ప్రజల మన్ననలు పొందుతూ మంచికి మారుపేరుగా ప్రజల్లో తనదైన ముద్ర వేసుకున్న తాతిరెడ్డి తులసిరెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపామని ఇలాంటి స్వచ్ఛమైన మంచి మనిషికి మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు ప్రజాసేవకుడిగా రాజకీయ నాయకుడిగా మరెన్నో పదవులు పొందాలని అంచలంచలుగా ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు ఈ కార్యక్రమంలో ప్రభాకర్,రంగస్వామి,రాజు, తదితరులు పాల్గొన్నారు



# సమగ్ర శిక్షా, కర్నూలు జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో 233 బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీకు గాను మెరిట్ మరియు రోస్టర్ ప్రాతిపదికన



1597 మంది అభ్యర్థుల సర్టిఫికేట్లను పరిశీలించి 1 : 3 నిష్పత్తి యందు కేటగిరీల వారిగా రోస్టర్ ను అనుసరించి జాబితా రూపొందించి సబ్జెక్టు ల వారిగా అను బ్లాగ్ నందు ఉంచడమైనది. వీరందరకూ నైపుణ్య పరిక్ష ను వారికీ కేటాయించిన తెదిలయందు, ంఖ మోడల్ స్కూల్, పెద్దపాడు నందు నిర్వహించబడును . నైపుణ్య పరిక్షకు ఎంపిక కాబడిన వారికి సమగ్ర శిక్షా, కర్నూలు కార్యాలయము, కర్నూలు నుండి అభ్యర్థుల వ్యక్తిగత నంబెర్ కు ఫోన్ ద్వార తెలియపరచడం జరుగును.నైపుణ్య పరిక్ష జిల్లా స్థాయి కమిటి కు కర్నూలు జిల్లా సంయుక్త కలెక్టర్ గారు చైర్మన్ గా సమగ్ర శిక్షా అదనపు పధక సమన్వయకర్త, కన్వీనర్ గా వ్యవహరిస్తారు. ఇందులో జిల్లా విద్యా శాఖా అధికారి, నంద్యాల జిల్లా సమగ్ర శిక్షా అదనపు పధక సమన్వయకర్త , కర్నూలు జిల్లా బాలికల అబివృద్ధి అధికారిణి, విషయ నిపుణులు సభ్యులుగా ఉంటారు. అభ్యర్ధుల ,ఎంపిక పూర్తి పారదర్శకం గా జరుగుతుంది. దళారులను నమ్మి మోసపోవద్దని తెలియపరుస్తున్నాం. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే జిల్లా కలెక్టర్ గారికి లేదా జాయింట్ కలెక్టర్ గారి దృష్టికి తీసుకు రావాలని కోరుతున్నాము ఎంపిక ప్రక్రియ పూర్తి అయిన తర్వాత కూడా అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు నకిలీవి అని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకొనబడతాయి.

# శృతి మించుతున్న సోషల్ మీడియా వార్

విజయవాడ, జూన్ 29,ఏపీలో ప్రధాన పార్టీ మధ్య ఫేక్ ప్రచారం పతాక స్థాయికి చేరింది. అసత్య ప్రచారాలు హద్దులు దాటేసి మార్ఫింగ్ ఫోటోల స్థాయికి ఎదిగాయి. అబద్దాల ప్రచారంలో పార్టీలు పోటీలు పడుతున్నాయి. సోషల్ మీడియాలో హద్దు, అదుపు లేకుండా ముసుగు ముఖాలు చెలరేగిపోతున్నాయి.ఏపీలో పొలిటికల్ వార్ బయట కంటే సోషల్ మీడియాలోనే ఎక్కువ జరుగుతోంది. రాజకీయ పార్టీల తరపున వాటి సోషల్ మీడియా ఖాతాల్లో అభిమానులు తమ పార్టీల తరపున చెలరేగిపోతున్నారు. ఈ క్రమంలో మార్ఫింగ్ ఫోటోలు, నకిలీ వార్తలు హల్చల్ చేస్తున్నాయి. ట్విట్టర్ టీడీపీ,వైసీపీల మధ్య చిన్నపాటి యుద్ధమే నడిచింది. టీడీపీ అనుకూలంగా పోస్టులు పెట్టే మహిళపై వైసీపీ అభిమానులు విరుచుకుపడ్డారు. ఆమె వ్యక్తిగత ఫోటోలను ట్రోల్ చేశారు. దీంతో అవి మార్ఫింగ్ అంటూ బాధితురాలు వీడియో ద్వారా వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఈ పరిణామాలకు కారణం మీరంటే మీరేనని ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకున్నారు.సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్లకు గిరాకీ పెరగడంతో రాజకీయ పార్టీల తరపున వకాల్తా పుచ్చుకుని అభిప్రాయాలు వ్యక్తం చేసే వారికి గిరాకీ పెరిగింది. ఈ క్రమంలో అయా వ్యక్తులు నిరాధార ఆరోపణలతో సోషల్ మీడియాలో తమ పరపతి పెంచుకునే ప్రయత్నాలు చేయడమే ఈ వివాదాలకు అసలు కారణంగా కనిపిస్తోంది.ఏపీ అన్ని ప్రధాన పార్టీలు పెద్ద ఎత్తున సోషల్ మీడియా బృందాలను సమకూర్చుకున్నాయి. వీటికి తోడు అయా పార్టీలకు కన్సల్టెన్సీ సేవలు అందిస్తున్న సంస్థలు కూడా ఫేక్ ప్రచారాలపైనే ప్రధానంగా దృష్టి పెట్టాయి.రాజకీయ విమర్శల పేరుతో జనం మెదళ్లలో విషప్రచారాల ద్వారా అనుమానాలు నెలకొల్పడం వీటి కార్యకలాపాల్లో ప్రధాన భాగం అయిపోయింది.తాజా?గా టీడీపీ, వైసీపీల మధ్య తలెత్తిన వివాదం వివేకా హత్య కేసు దర్యాప్తుతో ప్రారంభమైంది. వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్ రెడ్డి పాత్ర గురించి టీడీపీ పెద్ద ఎత్తున ట్రోల్ చేసింది. ఈ క్రమంలో 2019లో వివేకా హత్య సమాచారం తాడేపల్లికి తెల్లవారు జామునే తెలిసిందని కథనాలు వెలువడ్డాయి. ఈ వార్తలను ఆధారంగా చేసుకుని ముఖ?యమైన వ్యక్తుల కుటుంబ సభ్యుల్ని టార్గెట్ చేసుకుని ట్రోలింగ్ ప్రారంభించారు. ఓ దశలో ఇవి శృతి మించిపోయాయి.ఈ తరహా ప్రచారాల్లో నిజనిజాలు బయటకు తెలిసే అవకాశం ఎప్పటికీ ఉండదు. కానీ వ్యక్తిత్వ హననం, సోషల్ మీడియా దుష్ప్రచారాలతో దుమ్మెత్తిపోయడం ఓ పథకం ప్రకారం జరుగుతుంటుంది. కొన్నాళ్లకు అవే జనం మనసులో నాటుకుపోతాయి. సోషల్ మీడియాలో ఈ తరహా పోస్టులు పెట్టే వారెవరికి అసలు ముఖాలు, పేర్లు కూడా ఉండవు. వారు పెట్టే పోస్టులను బట్టి ఏ పార్టీకి చెందిన వారు అనేది తెలుసుకోవాల్సిందే.తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా విదేశాల నుంచి పోస్టులు పెట్టే ఎన్నారై మహిళ, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులపై అనుచితంగా పోస్టులు పెట్టారంటూ వైసీపీ శ్రేణులు సోమవారం చెలరేగిపోయాయి.

ఆ పోస్టులు పెట్టిన మహిళను టార్గెట్ చేస్తూ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఫోటోలను తెరపైకి తెచ్చారు. పద్ధతి మార్చుకోకపోతే వీడియోలు కూడా రిలీజ్ చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఇవన్నీ మార్ఫింగ్ ఫోటోలని బాధితురాలు వివరణ ఇచ్చింది.సోషల్ మీడియాలో సాగుతున్న ఈ తరహా అనైతిక పోరాటాలకు ప్రధాన పార్టీల బాధ్యత కూడా ఉంది. ఏపీలో ప్రధానమైన టీడీపీ, వైసీపీలు జీతాలు చెల్లించి మరీ ఈ తరహా అల్లరి మూకల్ని, డిజిటల్ సైన్యాన్ని పోషిస్తున్నాయి. ప్రత్యర్థులపై విమర్శించే క్రమంలో హద్దులు చెరిపేయడంలో ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. రాజకీయ విమర్శల పేరుతో మహిళల్ని కించపరచడం, దూషించడం యథేచ్ఛగా సాగిపోతోంది. ప్రత్యర్థి పార్టీలను విమర్శించే క్రమంలో వారి మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడానికి నేతల కుటుంబాలను, మహిళలను టార్గెట్ చేయడం పరిపాటై పోయింది.ఈ తరహా పోరాటాలు తాము ప్రారంభించలేదు కాబట్టి ప్రత్యర్థులదే పూర్తి బాధ్యత అని రెండు పక్షాలు సమర్ధించుకోవడం గమనార్హం. వైసీపీ ట్రోలింగ్‌కు గురైన బాధిత మహిళకు మద్దతుగా టీడీపీ నాయకుడు నారా లోకేష్ ట్వీట్ చేస్తే, తమ జోలికి వస్తే ఇలాంటి దాడులు తప్పవని వైసీపీ శిబిరం హెచ్చరించింది. సోషల్ మీడియా చూసే వారికి మాత్రం రెండు పార్టీలు వీధిన పడి కొట్టుకోవడం వినోదాన్ని పంచుతోంది.

# రంగు రాళ్ల మాఫియా

గుంటూరు, జూన్ 29, భూమిలో లభ్యమయ్యే అమ్యూమైన సంపదల్లో ఒకటి రంగురాళ్లు. అదృష్టం బాగుంది ఒక్క చిన్న రాయి దొరికినా చాలు రాత్రికి రాత్రే లక్షాధికారులయిపోవచ్చు అని భావిస్తారు. ఈ నేపథ్యంలో తొలకరి జల్లు పడితే చాలు రంగు రాళ్లను దక్కించుకునేందుకు సామాన్యుల నుంచి మాఫియా వరకూ అనేకరకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. అయితే తాజాగా సహజ సంపదను, అటవీ సంపదను దోచుకునే ఓ ముఠా రంగురాళ్ళపై కన్నేసింది.. తమ దోపిడికి అడ్డువచ్చిన అటవీ శాఖ సిబ్బందిపై సైతం దాడులకు తెగబడింది. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం శంకరాపురంలో రంగురాళ్ల మాఫియా రెచ్చిపోయింది. అటవీ సంపదను దోచుకోవడానికి తెగబడింది.. అందుకు అడ్డువచ్చిన అటవీ అధికారులపై దాడులకు సైతం పాల్పడింది. అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఓ అటవీ అధికారిని ఆటోతో ఢీకొట్టే ప్రయత్నం చేసింది. అంతేకాదు.. పరిసర గ్రామాల ప్రజలను పోగేసి అటవీ అధికారులపైకి దాడి చేయడానికి ఉసిగొలిపే ప్రయత్నం చేయడంతో అటవీ అధికారులు.. పోలీసులను ఆశ్రయించారు. తమకు రక్షణ కల్పించాలంటూ పోలీస్?స్టేషన్ తలుపులు తట్టారు. రంగురాళ్ల అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారం మేరకు ఫారెస్ట్ అధికారులు ఘటన స్థలానికి వెళ్లగా.. వారిపై రంగురాళ్ల గ్యాంగ్ దాడికి తెగబడ్డారు. ఆటో ఎక్కించే ప్రయత్నం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై దాచేపల్లి పోలీస్? స్టేషన్‌లో ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మురళీ ఫిర్యాదు చేసినట్లు ఫారెస్ట్ అధికారులు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడికి తెగబడిన వారిని గుర్తించి వారిపై చర్యలు చేపడతామన్నారు

# నాలుగేళ్లలో నరకం పేరుతో ప్రచారం

నెల్లూరు, జూన్ 29, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'నాలుగేళ్ల నరకం'ప్రచార కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కొనసాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా పోస్టర్లు వెలిశాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని పేర్కొంటూ గణాంకాలతో సహా పోస్టర్లపై ముద్రించారు. ప్రధానంగా గుంటూరు, విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఒంగోలు రైల్వేస్టేషన్ వంటి కీలక ప్రాంతాలలో పోస్టర్లు అంటించారు. రాష్ట్రంలో పెరుగుతున్న నేరాల రేట్లు, వెనుకబడిన వర్గాలు, మహిళలపై దాడులు, ఎయిడెడ్ పాఠశాలల మూసివేత, పీజీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల తొలగింపు, రైతు ఆత్మహత్యలు, ఆగిపోయిన ఆరోగ్యశ్రీ సేవలు, ఓఔఅ కంపెనీల తరలింపు, నిరుద్యోగం వంటి కొన్ని ప్రధాన అంశాలు పోస్టర్‌లపై హైలైట్ చేశారు.రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు పెరిగిపోయాయి. మహిళలపై దాడుల సంఖ్య 2020లో 7,039 ఉండగా 2021లో 10,373 నుండి 2022 నాటికి 11,895కి పెరిగింది. మహిళలకు మరింత రక్షణ కల్పించాల్సిన 'దిశా' చట్టం , ఇప్పటికీ అమలు కాలేదు. 2023 ఎస్సెస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం 77 శాతంగా నమోదైంది. దీంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. అంతకుముందు టీడీపీ హయాంలో ఉత్తీర్ణత శాతం ఎప్పుడూ 90శాతం కిందకు పడిపోయిన దాఖలాలు లేవు. పీజీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్షిప్‌లను రద్దు చేసింది.దీంతో పీజీ విద్యార్థులు ప్రైవేట్ కాలేజీల్లో చదువుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. అంతేకాదు ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు కూడా పెంచకపోవడంతో మరింత ఇబ్బందులకు విద్యార్థులు గురవుతున్నారు. రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రం దేశంలోనే మూడో స్థానంలో ఉంది. గడిచిన నాలుగేళ్లలో 3 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పక్క రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ ఖరీదు 15,000 రూపాయలు కాగా, రాష్ట్రంలో అది 36,000 రూపాయలుగా ఉంది. ఆరోగ్యం, మౌలిక సదుపాయాలపై తక్కువ పెట్టుబడి,పెరిగిన నిరుద్యోగం ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉంది. రాష్ట్రంలో పదకొండు వైద్య కళాశాలలు నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఈ కాలేజీలకు సూపరింటెండెంట్లు కూడా లేరు. ప్రభుత్వ వేధింపుల వల్ల 53 పరిశ్రమలు రాష్ట్రం విడిచి వెళ్లిపోయాయి. కనీసం 0.5% విదేశీ పెట్టుబడులు రాష్ట్రానికి రాలేదు. చిత్తూరు డెయిరీ ఆస్తులను 99 ఏళ్లకుగాను అమూల్ సంస్థకు అప్పగించారు. గడిచిన నాలుగేళ్లలో ఉద్యోగాల క్యాలెండర్ ఎక్కడ వేసిన గొంగిలి అక్కడే అన్నట్లుగా ఉంది. ఒక్క డీఎస్సీ పరీక్ష కూడా జరగలేదు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత యువతలో నిరుద్యోగిత రేటు 35.1 శాతంగా ఉంది.రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని గాలికొదిలేసిందని చెబుతూ పోస్టర్ల ద్వారా సామాజిక మాధ్యమాల్లో చర్చను తీసుకొచ్చారు. రానున్న రోజుల్లో నాలుగేళ్ల నరకం అనే ఈ క్యాంపెయిన్‌ను మరింత విస్తృతం చేయనున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించి జగన్ ప్రభుత్వ తీరును ఎండగట్టనున్నారు. ఈ మేరకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు రాష్ట్ర ప్రజలు ఈ ర్యాలీల్లో పాల్గొనడంతో పాటు సోషల్ మీడియా క్యాంపెయిన్‌లో కూడా భాగస్వాములు కావాలని టీడీపీ పిలుపునిచ్చింది.

# మేయర్ వర్సెస్ ఎమ్మెల్యే

గుంటూరు, జూన్ 29, గుంటూరు నగరపాలక సంస్థ మేయర్, తూర్పు నియోజకవర్గ ఎంఎల్ఏ కు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమమంటోంది. ఇద్ధరూ అధికార వైసీపీ పార్టీకి చెందిన వారు అయినప్పటికి ఇద్దరి మధ్య ముఖాలు కూడా చూసుకోనంత శత్రుత్వం పెరిగిపోయింది. ప్రతిపక్ష శాసన సభ్యులు తమ పనులు జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేసిన ఘటనలు చూశాం...కానీ అధికార పార్టీ ఎంఎల్ఏ తన నియోజకవర్గం లో వర్క్స్ జరగడం లేదటూ ఆందోళన వ్యక్తం చేయడమే కాకుండా దణ్ణం పెడతాను మా వర్క్స్ పూర్తి చేయండి ఆంటూ సాగిల పడిన ఘటన గుంటూరులో చోటు చేసుకుంది. ఈ అంశం వైరల్ కావడంతో హైకమాండ్ కూడా దృష్టి సారించింది. గుంటూరు తూర్పు ఎంఎల్ఏ ముస్తాఫా, గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మధ్య కొంత గ్యాప్ ఉంది. .గుంటూరు కార్పోరేషన్ పరిధిలో మొత్తం మూడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలు పూర్తిగా నగర పాలక సంస్థ పరిధిలోకి వస్తాయి. వైసీపీ పార్టీ అధికారంలో లేని సమయంలో ముస్తాఫా, కావటి మనోహర్ నాయుడు మధ్య సఖ్యత ఉండేది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగన కార్పొరేషన్ ఎన్నికలలో వైసీపీ విజయం సాధించింది. మేయర్ పదవిని చెరి రెండున్నర సంవత్సరాలు ఈస్ట్, వెస్ట్ ప్రాంతాలకు కేటాయించారు. మొదటి రెండున్నర సంవత్సరాలు కావటి మనోహర నాయడు...మరో రెండున్నర సంవత్సరాలు రమేష్ గాంధీకి కేటాయించారు. అనారోగ్యంతో రమేష్ గాంధి మరణించారు. మనోహర్ కు కేటాయించిన రెండున్నర ఏళ్ళ పదవీ కాలంపూర్తి అయింది. మేష్ గాంధీ చనిపోయాడు కనుక మనోహర్ నే మేయర్ గా కంటిన్యూ అవుతున్నారు. అప్పటి నుంచి ఈస్ట్ ఎంఎల్ఏ ముస్తాఫా కు మేయర్ మనోహర్ నాయుడికి మధ్య విభేధాలు పొడచూపాయి. మేయర్ ను మార్చే దిశగా ముస్తాఫా ప్రయత్నం ప్రారంభించారు..తన నియోజక వర్గ పరిధిలో ఉన్న కార్పొరేటర్లతో అసమ్మతి గళం వినిపించేందుకు సిద్ద మయ్యారు . 19 మంది కార్పొరేటర్లు సమావేశం అయి మేయర్ మనోహర్ కు వ్యతిరేకంగా గళం విప్పారు. వీరి వెనుక ఉండి నడిపించింది ఎంఎల్ఏ అని మేయర్ వర్గం అనుమానించింది. ఇద్దరిని పిలిచి హైకమాండ్ సర్దుబాటు చేసే ప్రయత్నం చేసింది. అయితే మూడు రోజుల క్రితం జరిగిన కార్పొరేషన్ మీటింగ్ ను వేదికగా చేసుకొని చె ఎంఎల్ఏ ముస్తాఫా మరిన్ని ఆరోపణలు చేశారు. తన పరిధిలోని డివిజన్ లో అభివృద్ధి పనులు చేయడం లేదని ఒక రేంజ్ లో విరుచుకు పడ్డారు .తాను చేసిన పాపమేమిటని ప్రశ్నించారు...వార్డులలో తిరుగుతూంటే ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. .తమపరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలు జరగక పోవడానికి కారణం ఏమిటో చెప్పాలని మేయర్ ను ప్రశ్నించారు..వరుసగా రెండు సార్లు ముస్తాఫా ఈస్ట్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు.. మూడవ సారి సీటు దక్కటం కష్టమన్నట్లు టాక్ వినిపిస్తోంది. నియోజకవర్గంలో వ్యతిరేకత పెరిగిందంటున్నారు. ఇది గమనించిన ముస్తాఫా ఇక తాను పోటీ చేయనని ఆ సీటు తన కుమార్తెకు ఇవ్వాలని సీయం వద్ద ప్రపోజల్ పెట్టారు. అయితే డిప్యూటీ మేయర్ సజీలా ఈస్ట్ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ముస్తాఫా కుమార్తె కంటే తను అన్ని విధాల ముందంజలో ఉన్నానని చెబుతున్నారు. జరుగుతున్న పరిణామాలు ఎప్పటికప్పుడు గమనిస్తున్న ముస్తాఫా మీడియాని ఎట్రాక్ట్ చేసి ప్రజలలో తన పేరు నలిగేలా నగర పాలక సంస్థ సమావేశాలను ఒక రేంజ్ లో వాడుకొనే ప్రయత్నం చేసారని పొలిటికల్ సర్కిల్స్ లో చర్చ జరుగుతోంది.

# అన్నకోసం సోనియా తో విభేధం

## కాంగ్రెస్ కు దగ్గరవుతున్న షర్మిల



విజయవాడ, జూన్ 29, 29 జూన్ 2010 ..ఢిల్లీ లో వై యస్ రాజశేఖర్ రెడ్డి కుమారుడు జగన్ మోహన్ రెడ్డి , తన తల్లి విజయలక్ష్మి , చెల్లెలు షర్మిల తో పాటు సోనియా గాంధీ ని కలిశారు. తన తండ్రి మరణాన్ని తట్టుకోలేక మృతి చెందిన అభిమానులు, కార్యకర్తల కుటుంబాలను పరామర్శిస్తా నంటూ జగన్ మొదలు పెట్టిన ఓదార్పు యాత్ర అప్పటికే తెలంగాణ ప్రాంతంలో ఒక జిల్లా..ఆంధ్ర ప్రాంతం లో మరో జిల్లా లోనూ జరిగింది. అయితే పార్టీ హై కమాండ్ నుండి ఈ యాత్ర కు గ్రీన్ సిగ్నల్ రాకపోవడం తో తాత్కాలికంగా ఓదార్పు యాత్ర ను పోస్ట్ ఫోన్ చేశారు. హైకమాండ్ ను కలవాలని పెద్దలు సూచించడంతో కుటుంబంతో సహా జగన్ ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీ లోని సోనియా గాంధీ నివాసం లో అరగంట సేపు భేటీ జరిగింది. ఓదార్పు యాత్ర ను ఆపి వేయాలని.. వైయస్ ఆర్ కోసం చనిపోయిన వారి కుటుంబాలను జిల్లా కేంద్రాల్లో మీటింగ్ ఏర్పాటు చేసి అక్కడికే వారిని పిలిపించి చెక్కులు అందజేయాలని చివరికి సోనియా గాంధీ సూచించారు. దానికి జగన్ అంగీకరించలేదు. తాను ఆల్రెడీ బాధిత కుటుంబాలకు మాట ఇచ్చానని జగన్ సోనియా కు తెలిపిన జగన్ ఓదార్పు యాత్ర ఆపనని చెప్పి వచ్చేశారు. తొమ్మిది రోజుల తర్వాత హైకమాండ్ మాటను కాదని మళ్లీ ఓదార్పు యాత్ర మొదలు పెట్టారు. కాంగ్రెస్ లోని జగన్ వ్యతిరేక వర్గం ఇందిరా గాంధీ..రాజీవ్ గాంధీ లు చనిపోయినప్పుడు కూడా ఇంతమంది చనిపోలేదు వై యస్ ఆర్ కోసం మాత్రం ఎలా చనిపోయారు.. ఇది కేవలం జగన్ వ్యక్తిగత ఇమేజ్ కోసం చేస్తున్న ప్రచారం అంటూ ఆరోపణలు చేసేవారు.తర్వాత జగన్మోహన్ రెడ్డికి చెందిన మీడియాలో కాంగ్రెస్ హైకమాండ్‌కు వ్యతిరేకంగా వార్తలు, కథనాలు ప్రసారం చేయడం ప్రారంభించారు. దీనిపై పార్టీ హైకమాండ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే నాటి కాంగ్రెస్ ఎమ్మెల్సీ..దివంగత సీఎం జూఖీ సోదరుడు వివేకానంద రెడ్డి సాక్షి టీవీ లో వచ్చిన కథనాల పై విచారం వ్యక్తం చేస్తూ పార్టీ హై కమాండ్ కి విధేయత ప్రకటించారు. ఈ వరుస పరిణామాల ఫలితంగా 29 నవంబరు 2010 న జగన్మోహన్ రెడ్డి పార్టీ కి 5 పేజీల పేజీల రాస్తూ పార్టీకి ..ఎంపీ పదవికి రాజీనామా చేశారు. అదే సమయంలో ఆయన తల్లి విజయమ్మ కూడా పులివెందుల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఆ తరువాత జగన్ ,విజయమ్మ లు ఉప ఎన్నికల్లో గెలవడం..సొంత పార్టీ అనౌన్స్ చెయ్యడం ..మరో వైపు ఆయనపై కాంగ్రెస్ నేతలు.. ఇతర రాజకీయ ప్రత్యర్థులు కేసులు వెయ్యడం ఫలితంగా 16 నెలల పాటు జైలు కు వెళ్లి రావడం.. ఈలోపు రాష్ట్రం రెండుగా విడిపోవడం..వంటి పరిణామాలుజరిగాయి. సోనియా గాంధీ ఓదార్పు యాత్ర కు అనుమతి ఇవ్వక పోవడం వెనుక కారణాలు చాలానే ఉన్నాయిని చెబుతారు. ఆ సమయంలోనే తెలంగాణ మలిదశ ఉద్యమం బలంగా మొదలైంది. తెలంగాణ లో ఉప ఎన్నికల హడావుడి జోరుగా ఉంది. ఆ సమయంలో జగన్ ఓదార్పు యాత్ర పార్టీ కి నష్టం చేస్తుంది అని కాంగ్రెస్ భావించింది మరో వైపు ఓదార్పు యాత్ర పేరుతో జగన్ మోహన్ రెడ్డి తన వ్యక్తిగత ఇమేజ్ పెంచుకుంటున్నారు తప్ప పార్టీ కి మద్దతుగా ఆయన యాత్ర సాగడం లేదన్న రిపోర్ట్స్ సొంత పార్టీ నేతల నుండే హై కమాండ్ కు చేరాయి. అలాగే వైయస్ రాజశేఖర్ రెడ్డి లాంటి బలమైన నేత మరణం తో ఒక్కసారిగా చెల్లా చెదురైన పార్టీ లో జగన్మోహన్ రెడ్డి యాత్రల పేరుతో మరింత కన్ఫ్యూజన్ క్రియేట్ చేస్తున్నారని హై కమాండ్ భావించింది.రాజకీయాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు . అలాగే పాలిటిక్స్ లో శాశ్వత మిత్రులు..శాశ్వత శత్రువులు ఉండరు అంటారు . దానికి సాక్ష్యం గా 13 ఏళ్ల నాటి సమావేశంలో అన్న జగన్ కు మద్దతుగా సోనియా గాంధీ తో విభేదించిన వైయస్ షర్మిళ ఇప్పుడు అన్నతో విభేదించి తెలంగాణా లో పార్టీ పెట్టి. అదే కాంగ్రెస్ పార్టీ కు సన్నిహితం అవుతున్నారు . త్వరలో షర్మిల సోనియాతో భేటీ కావొచ్చని చెబుతున్నారు.

# ఎస్వీ యూనివర్శిటీలో క్షుద్ర పూజలు

తిరుపతి, జూన్ 29, తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో క్షుద్రపూజల వ్యవహారం కలకలం రేపుతోంది. విరూపాక్ష సినిమా తరహాలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేశారు. గత రెండు రోజుల క్రితం ఎస్వీ యూనివర్సిటీ లైబ్రరీ భవనానికి కొంత దూరంలో ఉన్న నాలుగు రోడ్ల కూడలిలో క్షుద్ర పూజలు జరిగాయి. ఈ పూజలకు ముగ్గు, బొగ్గు పొడి, ఉప్పుతో పుర్రె గుర్తుతో ముగ్గులు వేసి కోడి గుడ్లు, రక్తంతో పూజలు చేశారు. గత కొద్ది రోజులుగా యూనివర్శిటీ ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొనడంతో యూనివర్శిటీ అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. అంతే కాకుండా రాత్రి సమయాల్లో యూనివర్శిటీ ప్రాంతాల్లో మద్యం సేవించి, వ్యర్థాలను చెల్లాచెదురుగా పడేసి వెళ్తున్నారు. ఎందరో మేధావుల విద్యను అభ్యసించిన ఎస్వీ యూనివర్శిటీలో.. సుదూర ప్రాంతాల నుండి ఎంతో మంది పేద విద్యార్థులు ఇక్కడకు వచ్చి విద్యను అభ్యసిస్తుంటారు. హాస్టల్లలో ఉంటూనే చదువుకుంటారు. ఎక్కువ మంది విద్యార్థులు పగలు చెట్ల క్రింద చదువుకుంటూ ఉంటే, మరికొందరు లైబ్రరీకి వెళ్తుంటారు. ఇలా తరచూ లైబ్రరీకి, మైయిన్ బిల్డింగ్, క్యాంటీన్ వద్దకు విద్యార్థులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అయితే రాత్రి సమయాల్లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు యూనివర్శిటీ ప్రాంగణంలోకి ప్రవేశించి రాత్రి సమయాల్లో క్షుద్ర పూజలకు, అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడుతూ ఉండడంతో అధ్యాపకులు, విద్యార్దులు భయాందోళనకు గురి అవుతున్నారు. దీనిపై ఎస్వీ యూనివర్శిటీ విద్యార్థుల సంఘం నాయకులు స్పందిస్తూ.. క్షుద్రపూజలు ఎవరూ చెస్తున్నారో, ఎందుకు యూనివర్శిటీనే ఎంచుకున్నారో అర్థం కావడం లేదని అంటున్నారు. నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగించే నాలుగు రోడ్ల కూడలి వద్దనే క్షుద్ర పూజలు చేస్తున్నారని, ముఖ్యంగా యూనివర్శిటీ ఆవరణంలో సీసీ కెమెరాలు లేకపోవడంతోనే గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించి ఇష్టం వచ్చినట్లుగా చేస్తున్నారని అన్నారు.

# స్థిరాస్తి వ్యాపారి, భార్య కిడ్నాప్.. పోలీసుల అదుపులో దుండగులు

విశాఖపట్నం: విశాఖలో స్థిరాస్తి వ్యాపారి దంపతులను కిడ్నాప్ చేసిన ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడకు చెందిన శ్రీనివాస్, లోవ లక్ష్మి దంపతులు నాలుగు నెలల క్రితం విశాఖ వచ్చారు.నగరంలోని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఉంటున్న వారిని దుండగులు బుధవారం కిడ్నాప్ చేశారు. రూ.60లక్షలు ఇవ్వాలని కిడ్నాపర్లు డిమాండ్ చేస్తున్నట్లు బంధువులు పోలీసులకు సమాచారమిచ్చారు.దీంతో పోలీసులు రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో గురువారం అన్నవరం మండలం కత్తిపూడి వద్ద కారులో వెళ్తున్న ఐదుగురు దుండగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాపర్లను విజయవాడకు చెందిన వారిగా గుర్తించారు. శ్రీనివాస్, అతడి భార్య లక్ష్మి సురక్షితంగా ఉన్నారని పోలీసులు తెలిపారు.



# బొడ్డు తాడు పై చర్చోపచర్చలు

హైదరాబాద్, జూన్ 29, (న్యూస్ పల్స్)హీరో రామ్ చరణ్, ఉపాసన దంపతులు.. ఇటీవలే తల్లిదండ్రులైన సంగతి తెలిసిందే. డెలివరీకి ముందే ఉపాసన తనకు పుట్టబోయే బిడ్డ కోసం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వాటిలో మొదటిది పాప బొడ్డుతాడు ను భద్రపరచడం. అయితే, ఇదేదో పాప జ్ఞాపకార్థం కోసం దాచి పెట్టడం లేదు. చిన్నారి భవిష్యత్తు కోసం. అదేంటీ?గతేడాది బిడ్డకు మగ బిడ్డకు జన్మనిచ్చిన కాజల్ అగర్వాల్ కూడా ఇదే పని చేసింది. అంతేకాదు, మహేష్‌బాబు దంపతులు ఈ ట్రెండ్ మొదలవ్వక ముందే తమ పిల్లల బొడ్డుతాడును ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన లాబ్‌లో భద్రపరిచారు. ఇలా చేయడానికి బలమైన కారణమే ఉంది. అదే.. బిడ్డ ఆరోగ్యం. మీ బిడ్డ భవిష్యత్తులో రక్త సంబంధిత వ్యాధులకు గురైతే.. పెద్ద పెద్ద మందులు చేయలేని చికిత్సను ఈ బొడ్డుతాడు చేస్తుంది. నమ్మబుద్ధి కావడం లేదు కదా. తల్లిని, బిడ్డను కలిపి ఉంచేది బొడ్డుతాడే. కడుపులో ఉన్నప్పుడు బొడ్డు తాడు ద్వారానే బిడ్డకు అవసరమైన గ్లూకోజ్, ఆక్సిజన్ అందుతుంది. ఈ బొడ్డుతాడులో ఉండే ధమని, సిరలు.. బిడ్డను సజీవంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. సిర నుంచి ఆక్సిజన్, ఇతరాత్ర పోషకాలు అందుతాయి. ధమని శిశువు నుంచి యూరియా, కార్బన్ డై ఆక్సైడ్‌లను తల్లి రక్తనాళాలకు చేర్చుతుంది. అయితే, ప్రసవం తర్వాత బొడ్డుతాడును తప్పకుండా కట్ చేయాలి. దాన్ని మొదలు వరకు కట్ చేయరు. కనీసం రెండు అంగుళాల గ్యాప్‌తో కట్ చేస్తారు. ఆ తర్వాత దానికి క్లిప్ పెడతారు. కొద్ది రోజుల తర్వాత ఆ బొడ్డుతాడు దానికదే ఎండిపోయి రాలిపోతుంది. ఒకప్పుడు దీన్ని వ్యర్థంగా భావించి పడేసేవారు. అయితే, బొడ్డుతాడు ఉండే రక్తంలోని మూల కణాలు బిడ్డ భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తాయని తెలిసినప్పటి నుంచి దాన్ని భద్రపరచడం మొదలుపెట్టారు. బొడ్డుతాడుపై జరిపిన పరిశోధనల్లో నిపుణులు కీలక విషయాలను తెలుసుకున్నారు. అందులో ఉండే హెమిటోపొయిటిక్ స్టెమ్ సెల్స్‌లోని మూల కణాలు చాలా ప్రత్యేకమైనవిగా గుర్తించారు. తలసేమియా, లుకేమియా, లింఫోమా, మయలోమస్, సీకెల్ సెల్ అనీమియా తదితర రక్త సంబంధిత వ్యాధుల చికిత్సకు ఈ మూల కణాలు ఉపయోగపడతాయని తెలుసుకున్నారు. అంటే భవిష్యత్తులో బిడ్డకు అలాంటి వ్యాధులైమైనా వస్తే ఆ మూల కణాల ద్వారా చికిత్స అందిస్తారు. బిడ్డ పుట్టిన

వెంటనే వైద్యులు బొడ్డుతాడులోని రక్తాన్ని సేకరించి లాబ్‌కు తరలిస్తారు. అక్కడ ప్లాస్మా డిప్లీషన్ ప్రక్రియ ద్వారా రక్తంలోని ప్లాస్మాను వేరు చేస్తారు. రక్త కణాలను మాత్రమే అతి తక్కువ ఉష్ణోగ్రతలు కలిగిన కోల్డ్ కంటైనర్‌లో స్టోర్ చేస్తారు. అయితే, ఇది కాస్త ఖర్చుతో కూడుకున్న ప్రక్రియే. మీ ఆర్థిక స్తోమతను బట్టి.. బొడ్డుతాడు రక్తాన్ని 25 నుంచి 75 ఏళ్ల వరకు భద్రపరుచుకోవచ్చు. అయితే, మీ బిడ్డకు తోబుట్టువులు ఉన్నట్లయితే ఇది అవసరం లేదు.

# సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మృతి కేసు.. ఫడణవీస్ కీలక వ్యాఖ్యలు



ముంబయి: బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణంపై మిస్టరీ ఇంకా వీడట్లేదు. తాజాగా ఈ కేసుపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుకు సంబంధించిన కీలకమైన సాక్ష్యాలను సేకరించినట్లు తెలిపారు. ఓ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మృతిపై జరుగుతున్న సీబీఐ దర్యాప్తు గురించి దేవేంద్ర ఫడణవీస్ స్పందిస్తూ.. ''ఈ కేసులో తొలుత ఉన్న సమాచారం వాళ్లూవీళ్లు చెప్పిన మాటల ఆధారంగానే ఉంది. కానీ, ఆ తర్వాత కొంతమంది ఈ కేసుకు సంబంధించి తమ వద్ద బలమైన సాక్ష్యాలు ఉన్నాయని చెప్పారు. దానిపై మేం చర్యలు చేపట్టాం. వారి వద్ద ఉన్న ఆధారాలను పోలీసులకు సమర్పించాలని కోరాం. ప్రాథమిక సాక్ష్యాలను సేకరించాం. ప్రస్తుతం వాటి విశ్వసనీయతను అధికారులు పరిశీలిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతోంది. ఈ దశలో నేను కేసు గురించి ఏం చెప్పలేను" అని వెల్లడించారు. 2020 జూన్ సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ముంబయిలోని తన అపార్ట్‌మెంట్‌లో విగతజీవిగా కన్పించిన విషయం తెలిసిందే. ఆయన మృతి బాలీవుడ్‌తో సహా దేశవ్యాప్తంగా సినీ అభిమానులను షాక్‌కు గురిచేసింది. తొలుత ఆయనది ఆత్మహత్య అని వార్తలు వచ్చాయి. అయితే సుశాంత్ మృతిలో కుట్ర కోణం ఉందని ఆయన కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో ఈ కేసులో సీబీఐ దర్యాప్తు చేపట్టింది. అయితే, మూడేళ్లు గడిచినా.. ఇప్పటి వరకు ఈ కేసులో ఎలాంటి పురోగతి లభించకపోవడం గమనార్హం. మరోవైపు సుశాంత్ మరణానికి వారం రోజుల ముందే ఆయన మాజీ మేనేజర్ దిశా సాలియన్ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందారు.

### కొలీజియంలోకి జస్టిస్ బి.ఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్

ఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియంలో మార్పులు చేర్పులు జరిగాయి. కొలీజియం సభ్యులు జస్టిస్ కె.ఎం.జోసెఫ్, జస్టిస్ అజయ్ రస్తోగి పదవీ విరమణ చేయడంతో..వారి స్థానంలో జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లను సీజేఐ తీసుకున్నారు. కొత్త కొలీజియంలో సీజేఐతో పాటు.. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లు సభ్యులు. వీరిలో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లకు భవిష్యత్తులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం వేసవి సెలవుల్లో ఉన్న సర్వోన్నత న్యాయస్థానం వచ్చే నెల 3న తెరుచుకోనుంది.

# ఆపదలో ఉన్న గుండెకు అండగా నిలిచిన మంత్రి వేముల

## గుండె ఆపరేషన్ కోసం 3 లక్షల ఎల్ఓసి అందజేసిన మంత్రి వేముల

హైదరాబాద్ జూన్ 29, (న్యూస్ పల్స్)బాల్కొండ మండల కేంద్రానికి చెందిన బండి పెద్ద మల్లయ్య యాదవ్ గుండె సంబంధిత అనారోగ్యంతో బాధ పడుతున్నాడు ఈవిషయం స్థానిక నాయకులు ద్వారా మంత్రి దృష్టికి తీసుకురాగా హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ లో గుండె ఆపరేషన్ కొరకు 3 లక్షల రూపాయల ఒూఅ మంజూరు చేయించారు. హైదరాబాద్ లోని మంత్రుల నివాసంలో గురువారం 3 లక్షల రూ. ఎల్ఓసి కాపీని బాధిత సోదరుడు బండి నడ్పి మల్లయ్యకు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. నిరుపేదలమైన మాకు గుండె ఆపరేషన్ కొరకు మూడు లక్షల ఒూఅ మంత్రి మంజూరు చేశారని, ప్రశాంత్ రెడ్డి వేలు మర్చిపోలేమని, జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా తెలియజేసారు. బాల్కొండ సర్పంచి భూస సునీత-నరహరి, బిఆర్ఎస్ పార్టీ బాల్కొండ మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యా సాగర్ మంత్రి వెంట ఉన్నారు

# హఠాత్తుగా ఓ నది నెత్తుటి రంగులోకి మారిపోయింది



హైదరాబాద్ జూన్ 29, (న్యూస్ పల్స్)ఏమైందో ఏమో ఒక్కసారిగా ఓ నది ఎరుపు రంగులోకి మారిపోయింది. ఈ షాకింగ్ ఘటన జపాన్‌లో చోటుచేసుకుంది. దీంతో ఒక్కసారిగా స్థానిక ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఓరియన్ బ్రూవరీస్ అనే బీర్ ఫ్యాక్టరీ లీక్ కారణంగా జరిగిందని అధికారులు పేర్కొన్నారు. ఈ షాకింగ్ ఘటన జపాన్‌లోని ఒకినావాలోని నాగో సిటీలోని ఓడరేవు వద్ద జరిగింది. కర్మాగారాన్ని చల్లబరిచే ప్రక్రియలో భాగంగా వినియోగించే ఒక రసాయనం కారణంగా ఇది జరిగిందని వివరణ ఇచ్చారు. ఇది సురక్షితమైనదేనని, ఈ రసాయనాన్ని కాస్మెటిక్ పరిశ్రమలో వియోగిస్తారని చెప్పారు. సదరు ఓరియన్ బ్రూవరీ కంపెనీ ఫుడ్‌కలరింగ్ రసాయనం వల్లే ఇది ఈ రంగులోకి మారిందని. దీని వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని తెలిపింది. తమ ఫ్యాక్టరీని చల్లబరిచే ప్రక్రియకు సంబంధించి ఆహార భద్రత చట్టాల నిబంధనలో జాబితాలో ఉందని వివరణ ఇచ్చింది. ప్రొపైలిన్ గ్లైకాల్ అనే రసాయంన లీకేజ్ కారణంగా ఇలా నది ఎరుపురంగులోకి మారిందని తెలిపింది. నిజానికి లీకైన శీతలీకరణ నీరు వర్షం నదిలోకి ప్రవహించడంతో ఇలా మారిందని, అది కాస్త సముద్రంలోకి చేరడంతో ఓడరేవు ఈ రంగులోకి మారిందని వెల్లడించింది ఓరియన్ బ్రూవరీస్ బీర్ కంపెనీ. ఈ మేరకు బీర్ కంపెనీ ప్రెసిడెంట్ హాజివ్ మురానో మాట్లాడుతూ.. ఈ అసౌకర్యానికి క్షమాపణలు చెప్పడమే గాకీ ఈ లీక్ ఎలా జరిగిందనే దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఢిల్లీ మెట్రోలో కొట్టుకున్న ప్రయాణికులు.. వీడియో వైరల్



కొన్ని అసభ్యకర ఘటనలతో ఇటీవలే ఢిల్లీ మెట్రో తరచూ వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. అసభ్యకర చేష్టలు, ముద్దుసీన్లు, డ్యాన్స్ రీల్స్ వంటి వీడియోలు చర్చకు దారితీశాయి. తాజాగా మరో వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. అయితే ఈ సారి ఇద్దరు ప్రయాణికుల మధ్య తీవ్రమైన ఘర్షణ చోటు చేసుకుంది. బుధవారం తెల్లవారుజామున రద్దీ రైల్లో ఇద్దరు ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. నిల్చోడానికి కూడా చోటు లేని రైలులో ఒకరికొకరు దూషించుకుంటూ కొట్టుకున్నారు. దీంతో ఇతర ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కొందరు వీరి మధ్య ఘర్షణను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే , వీరి గొడవకు కారణం ఏంటన్నది తెలియరాలేదు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ గా మారింది.

# మింట్ కాంపౌండ్ లో మిస్ ఫైర్

## ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ రామయ్య (49)మృతి

హైదరాబాద్ జూన్ 29, (న్యూస్ పల్స్) హైదరాబాద్ మింట్ కాంపౌండ్ లో విషాదం జరిగింది. ఎస్పిఎఫ్ కానిస్టేబుల్ రామయ్య గన్ మిస్ ఫైర్ లో మృతి చెందాడు. మృతుడు ని ప్రింటింగ్ ప్రెస్ లో సుమారు నాలుగున్నరా సంవత్సరాలుగా సెక్యూరిటీ గార్డ్ గా వున్నాడు. ఉదయం తుపాకిని శుభ్రం చేస్తుండగా ఫైర్ అయినట్లుగా అధికారులు తెలిపారు. తీవ్ర గాయాలైన రామయ్యను కేర్ ఆసుపత్రికి చేర్చారు. రామయ్య మృతిచెందడంతో పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రామంతాపూర్ లో నివాసం ఉంటున్న రామయ్య స్వస్థలం మంచిర్యాల.

# ఆస్కార్ కమిటీలో ఆర్‌ఆర్ ఆర్ టీమ్

హైదరాబాద్ జూన్ 29, (న్యూస్ పల్స్) ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డులు ప్రదానం చేసే 'ద అకాడమి ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' 398 మందికి కొత్తగా ఆస్కార్ కమిటీలో సభ్యత్వం కల్పించింది. భారతీయ సినిమా ప్రేక్షకులకు, మరీ ముఖ్యంగా తెలుగు ప్రజలకు గర్వకారణమైన అంశం ఏమిటి? అంటే... అందులో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్ర బృందం నుంచి ఆరుగురు ఉన్నారు'ఆర్‌ఆర్‌ఆర్ : రౌద్రం రణం రుధిరం' సినిమాలోని 'నాటు నాటు...' పాట బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ అందుకుని చరిత్ర సృష్టించిన సంగతి మనకు తెలుసు. ఆ పాటలో స్టెప్పులు వేసిన, ప్రేక్షకులను అలరించిన హీరోలు యంగ్ టైగర్ ఎన్టీఆర్, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తో పాటు సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి, గేయ రచయిత చంద్రబోస్, ఛాయాగ్రాహకుడు కె. సెంథిల్ కుమార్, ప్రొడక్షన్ డిజైనర్ సాబు సిరిల్... ఈ ఆరుగురికి ఆస్కార్ కమిటీలో చోటు కల్పించింది. సంగీతం విభాగంలో కీరవాణి, చంద్రబోస్... ఛాయాగ్రాహకుల విభాగంలో సెంథిల్... ప్రొడక్షన్ డిజైనర్ సెక్షన్లో సిరిల్... యాక్టర్స్ విభాగంలో చరణ్, ఎన్టీఆర్ ఉన్నారు. ఆస్కార్ అందుకున్న తొలి తెలుగు పాటగా, ఆ మాటకు వస్తే భారతీయ సినిమా పాటగా 'నాటు నాటు' నిలిచింది. దాంతో అభిమానులు, భారతీయ ప్రేక్షకులు కాలర్ ఎగరేశారు. ఇప్పుడు ఆస్కార్ కమిటీలో 'ఆర్‌ఆర్‌ఆర్' బృందానికి చోటు దక్కడంతో మరోసారి కాలర్ ఎగరేస్తున్నారు. శ్రీలంక సివిల్ వార్ నేపథ్యంలో తెరకెక్కించిన 'కణ్ణాతిల్ ముత్తమిట్టాల్' (తెలుగులో 'అమృత'గా విడుదలైంది), తమిళనాడు మాజీ ముఖ్యమంత్రులు ఎంజీ రామచంద్రన్, ఎం కరుణానిధి, జయలలిత జీవితాల స్ఫూర్తితో తెరకెక్కించిన 'ఇరువర్' (తెలుగులో 'ఇద్దరు'గా విడుదలైంది) సినిమాలకు గాను ప్రముఖ దర్శకుడు మణిరత్నానికి కూడా ఆస్కార్ కమిటీ ఆహ్వానం పలికింది. ఆస్కార్ అవార్డులకు ఉత్తమ డాక్యుమెంటరీ విభాగంలో నామినేట్ అయిన 'ఆల్ దట్ బ్రీత్స్' దర్శకుడు షౌనక్ సేన్ సైతం ఆహ్వానం అందుకున్నారు. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్ర బృందం నుంచి ఆరుగురికి ఆస్కార్ కమిటీ నుంచి ఆహ్వానాలు రావడంతో తెలుగు ప్రేక్షకులు, సినిమా ప్రముఖులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే... ఒక్క విషయంలో మాత్రం చిన్న అసంతృప్తి ఉంది. 'ఆర్‌ఆర్‌ఆర్'కు కర్త, కర్మ, క్రియ... ఆ సినిమా కెప్టెన్, దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళికి కూడా ఆస్కార్ కమిటీ నుంచి ఆహ్వానం అందితే బావుండేదని అభిప్రాయ పడుతున్నారు. రాజమౌళికి ఆహ్వానం రాకపోయినా సరే... ఆరుగురికి రావడం వెనుక ఆయన కృషిని మరువకూడదని చెబుతున్నారు. ప్రస్తుతం ఆస్కార్ కమిటీలో పది వేల మందికి పైగా సభ్యులు ఉన్నారు. కొత్తగా ఆహ్వానాలు అందుకున్న వారందరూ చేరితే ఆ సంఖ్య 10,817కి చేరుతుంది. అందులో ఓటింగ్ వేసే హక్కు 9,375 మందికి మాత్రమే ఉంటుంది.

# బ్రదీనాథ్ రూట్లో విరిగిపడ్డ కొండచరియలు.. చిక్కుకున్న టూరిస్టులు



న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో కీలకమైన హైవేపై కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో బద్రీనాథ్ టూరిస్టులు చిక్కుకుపోయారు. భారీ వర్షం వల్ల ఆ ప్రాంతంలో కొండచరియలు కూలాయి. చమోలీ జిల్లాలోని చిన్కా వద్ద ఈ ఘటన జరిగింది. మరో వైపు ఉత్తరాఖండ్‌కు ఆరెంట్ అలర్ట్ జారీ చేశారు. భారీ వర్షాలు కురవనున్నట్లు ఐఎండీ హెచ్చరించింది. ఇవాళ ఉదయం ఢిల్లీలో కూడా వర్షం పడింది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు జామైంది. కొన్ని రోజుల క్రితం హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు టూరిస్టులు చిక్కుకున్న విషయం తెలిసిందే. మనాలీలో దాదాపు 300 మంది టూరిస్టులు మూడు రోజుల పాటు ఎటూ కదలలేకపోయారు. దాదాపు 15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. మండీ.. కుల్లు రూట్లో ఆ జామైంది. హిమాచల్‌లో వర్షాల వల్ల 19 మంది మరణించారు.

# రాష్ట్ర విద్యావిధానంలో వినూత్న మార్పులు


కొవ్వూరు జూన్ 29, (న్యూస్ పల్స్) రాష్ట్రవ్యాప్తంగా 42,61,965 మంది తల్లుల ఖాతాల్లో 6,392.94 కోట్లు జమ చేయడం జరిగిందని, చదువులే పిల్లల కు మనం ఇవ్వగలిగే ఆస్తి నమ్మిన వ్యక్తి జగన్ మామ అని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత పేర్కొన్నా రు. పార్వతీపురం మన్యం జిల్లా కురు పాం లో నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నాలుగో ఏడాది జగనన్న అమ్మ ఒడి 2022-23 విద్యా సంవత్సరానికి సంబందించి వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ సంద ర్భంగా హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ మన రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థ ఉండకూడదనే ఏకైక లక్ష్యం విద్య విధానంలో జగనన్న విన్నూత్న మార్పులు తీసుకుని రావడం జరిగిందన్నారు. తల్లితండ్రుల ఆశయలకు ఆలోచనలకు ఒక మేనమామగా పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలో నాడు నేడు పనులు, అమ్మఒడి, గోరుముద్ద, వసతి దీవెన, విద్యా దీవెన, విదేశీ విద్య వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతోందన్నారు.

# మధ్యప్రదేశ్ సీఎంపై పోస్టర్లు.. కాంగ్రెస్‌కు ఫోన్‌పే వార్నింగ్..!

భోపాల్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కర్ణాటకలో మాదిరిగానే మధ్యప్రదేశ్‌లోనూ అధికార, ప్రతిపక్షాల మధ్య పోస్టర్ వార్ మొదలైంది. అయితే, భాజపాను ఉద్దేశించి కాంగ్రెస్ వెలువరించిన పోస్టర్లపై అభ్యంతరం వ్యక్తమైంది. డిజిటల్ పేమెంట్స్ సంస్థ ఫోన్‌పే ఈ పోస్టర్లపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్‌కు హెచ్చరిక పంపింది. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. ఇంతకీ ఏం జరిగిందంటే..? ఈ ఏడాది మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో భాజపా, కాంగ్రెస్ పోస్టర్ వార్ మొదలుపెట్టాయి. ఆ పోస్టర్ల మీద ప్రత్యర్థి ఫొటోతో పాటు క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తున్నాయి. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ఫొటోలు, క్యూఆర్ కోడ్స్ ఉంటున్నాయి. అంతేగాకుండా ఫోన్‌పే బ్రాండ్ నేమ్, లోగో కూడా కనిపిస్తున్నాయి. ఈ చిత్రాలను మధ్యప్రదేశ్ కాంగ్రెస్ తన ట్విటర్ ఖాతాలో షేర్ చేసి.. రాష్ట్ర ప్రభుత్వంలో ఒక పని జరగాలంటే 50 శాతం కమిషన్ ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శలు గుప్పించింది. ఇప్పుడు దీనిపై ఫోన్‌పే స్పందించింది.'మా బ్రాండ్ లోగో దుర్వినియోగాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. మాకు ఏ రాజకీయ పార్టీ లేక ప్రచారంతో సంబంధం లేదు.

# భారాసకు రబ్బర్‌స్టాంప్ గవర్నర్లే నచ్చుతారు: బండి సంజయ్

హైదరాబాద్: గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌పై మంత్రి హరీశ్‌రావు చేసిన



వ్యాఖ్యలను భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఖండించారు. రబ్బర్‌స్టాంప్ గవర్నర్లు మాత్రమే భారాసకు నచ్చుతారని ఎద్దేవా చేశారు. ''గవర్నర్‌ను హేళన చేయడం రాజ్యాంగాన్ని అవమానించడమే. భారాస చేస్తోన్న అవినీతిని గవర్నర్ చూస్తూ ఊరుకోవాలా? సీఎం అందుబాటులో లేరనే ప్రజలు రాజ్‌భవన్ వైపు చూస్తున్నారు'' అని బండి సంజయ్ అన్నారు.

# మింట్ కాంపౌండ్‌లో తుపాకీ మిస్‌ఫైర్..హెడ్ కానిస్టేబుల్ మృతి

హైదరాబాద్: ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో తుపాకీ మిస్‌ఫైర్ అయ్యింది. ఈ ఘటనలో అక్కడ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రామయ్య (49) మృతి చెందారు. తుపాకీ క్లీన్ చేస్తుండగా ప్రమాదశాత్తు ఫైర్ అవ్వడంతో అతడికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నాంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే మృతి



చెందినట్లు పోలీసులు వెల్లడించారు. ఆయన స్వస్థలం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటగా తెలిపారు.

# మామిడి పండును ఎక్కువగా తింటే ఈ ఆరోగ్య సమస్యలు తప్పవు జాగ్రత్త!



మామిడిపండ్లు అంటే ఇష్టం లేదని చెప్పే వారిని నేను ఇంతవరకూ చూడలేదు. ఒక్క మామిడి పండు తింటే తృప్తి కలగదు, కడుపునిండా తిన్నా ఇంకా తహతహలాడుతుంది, అదే మామిడి పండు రుచి ప్రత్యేకత. అయితే మామిడిపండు ఎక్కువగా తింటే కొన్ని ఆరోగ్య సమస్యలు వస్తాయి కాబట్టి మామిడిపండు ఎక్కువగా తింటే ఎలాంటి సమస్యలు వస్తాయో చూద్దాం. రోజూ నీళ్లలో నానబెట్టిన 4 ఎండు ఖర్జూరాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు! శరీరంలో చక్కెర పెరుగుతుంది: మీకు డయాబెటిస్ లేకపోయినా, మీరు మామిడిపండ్లను ఎక్కువగా తింటే, చక్కెర కంటెంట్ తరచుగా అలసటను కలిగిస్తుంది, కాబట్టి మామిడిని ఎక్కువగా తినకూడదు, ముఖ్యంగా మీకు డయాబెటిస్ ఉన్నవారు, ఇది మంచిది. మామిడి పండ్లను మితంగా తినండి. నొప్పి వస్తుంది మామిడిపండు ఎక్కువగా తింటే కిడ్నీ సమస్యలు వస్తాయి. ఇందులో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఎక్కువగా తినడం వల్ల కడుపు ఉబ్బరం వస్తుంది కాబట్టి ఎక్కువగా తినకూడదు. ఓఎబిష్త్రబ ఒనిట ఈజీఇబిబ: నేను యంగ్.. నాకస్సలే రక్తపోటు రాదని అనుకుంటున్నారా? బరువు పెరుగుతారు మామిడి పండ్లను ఎక్కువగా తినడం వల్ల బరువు పెరుగుతారు. మీరు ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నట్లయితే, ఒక రోజులో 330 గ్రాముల కంటే ఎక్కువ తినవద్దు, అంటే ఒక మామిడిపండు తింటే సరిపోతుంది. కృత్రిమంగా పండిన మామిడి పండ్లను ఉపయోగించవద్దు మార్కెట్‌లో చాలా మామిడి పండ్లు ఉన్నాయి, ఏది కృత్రిమంగా పండించబడిందో, ఏది సహజమో అని మీరు అయోమయంలో ఉంటే, కాండం చూడండి. పండ్లను కృత్రిమ పొడిని ఉపయోగించి పండిస్తే, దాని కాయలు పండవు. అలాగే సహజంగా పండిన మామిడి పండు తింటే తియ్యగా ఉంటుంది, కానీ మామిడికాయను పొడితో పండించారో, ఆ పండు తింటే తెలుస్తుంది, అలాంటి పండు ఇవ్వకండి. అలాగే మామిడికాయల పొడిని పిల్లలకు ఇవ్వకండి, వాటి వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చు. మామిడి పండు ఎప్పుడు తింటే మంచిది? మామిడిపండును ఎప్పుడు కావాలంటే అప్పుడు తినవచ్చు కానీ మామిడి పండును భోజనానికి అరగంట ముందు లేదా భోజనం చేసిన అరగంట తర్వాత తినడం చాలా మంచిది. ఇలా తినడం వల్ల మన శరీరం అందులోని పోషకాలను గ్రహించేలా చేస్తుంది. ఇక నుంచి మిల్క్ షేక్, జ్యూస్ చేసి తాగొచ్చు కానీ మామిడికాయను అలాగే తినండి.

# మధుమేహ వ్యాధిగ్రస్తులు డ్రై ఫ్రూట్స్ తినవచ్చా?ఎలాంటివి తినవచ్చో తెలుసుకుని తినండి!



మధుమేహానికి ప్రధాన కారణం జీవనశైలి మరియు ఆహారపు అలవాట్లు. మధుమేహం అనేది రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండే పరిస్థితి. నేడు చాలా మంది మధుమేహంతో బాధపడుతున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. చక్కెర తక్కువగా మరియు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉన్న ఆహారాన్ని ఎంచుకోండి. దీనితో పాటు ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. సహజంగా ఎండిన పండ్లలో ఉన్న నీటి శాతం తాజా పండ్లలా కాకుండా తొలగించబడుతుంది. అయితే ఇవి చివరికి అధిక సాంద్రీకృత పోషకాల మూలంగా మారతాయి. కాబట్టి తాజా పండ్లు మరియు ఎండిన పండ్లు రెండూ ఆహారంలో ముఖ్యమైన పోషకాలను అందిస్తాయి. డ్రై ఫ్రూట్స్ ఆహారంలో తమ స్థానాన్ని కలిగి ఉన్నప్పటికీ, షుగర్ స్పైక్‌లను నివారించడానికి ఈ డ్రై ఫ్రూట్‌లను ఎలా కలపాలో అర్థం చేసుకోవడం కూడా చాలా ముఖ్యం. అదే మనం ఈ పోస్ట్‌లో చూడబోతున్నాం.. డ్రై ఫ్రూట్స్ షుగర్ లెవెల్స్‌ను ప్రభావితం చేస్తాయా? మధుమేహ వ్యాధిగ్రస్తులు ఏదైనా ఆహారాన్ని తిన్నప్పుడు, ఎండిన పండ్లతో సహా ఆహారంలో లభించే చక్కెరలు లేదా కార్బోహైడ్రేట్లు విచ్ఛిన్నమవుతాయి మరియు గ్లూకోజ్ అణువులుగా రక్తప్రవాహంలోకి విడుదలవుతాయి. ఈ అణువులు మీ శరీరానికి పోషకాలు మరియు శక్తిని అందించడంలో సహాయపడతాయి. డయాబెటిక్ కాని వ్యక్తి కార్బోహైడ్రేట్ భోజనం తిన్నప్పుడు, ప్యాంక్రియాస్ ఇన్సులిన్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఇది రవాణా కోసం గ్లూకోజ్ నిల్వ మరియు ఉపయోగించడానికి సహాయపడుతుంది. అందుకే మధుమేహ వ్యాధిగ్రస్తులు తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేరు లేదా ఉపయోగించలేరు. వారు రక్తంలో చక్కెరను నియంత్రించడానికి మందులు తీసుకోవాలి. అదే సమయంలో, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచడానికి ఇన్సులిన్ యొక్క సరైన మోతాదు ఇవ్వడానికి కార్బోహైడ్రేట్ తీసుకోవడం జాగ్రత్తగా పర్యవేక్షించాలి. డ్రై ఫ్రూట్స్‌లో విటమిన్లు, మినరల్స్, ఫైబర్ మరియు యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నప్పటికీ, మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ రక్తంలో గ్లూకోజ్ స్థాయిలపై శ్రద్ధ వహించాలి. ఫైబర్ అధికంగా ఉండే డ్రై ఫ్రూట్‌లను ఎంచుకోండి. ఫైబర్ నెమ్మదిగా జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలపై తక్కువ ప్రభావాన్ని చూపుతుంది. అలాంటి డ్రై ఫ్రూట్స్ ఏంటో, వాటి పోషక విలువలు ఏమిటో చూద్దాం. మధుమేహ వ్యాధిగ్రస్తులు డ్రై ఫ్రూట్స్ తినడం వల్ల కలిగే ప్రయోజనాలు మధుమేహ వ్యాధిగ్రస్తులు డ్రై ఫ్రూట్స్ తినడం ద్వారా వారి ఆహార నాణ్యతను మెరుగుపరుచుకోవచ్చు. 2021లో జర్నల్ ఆఫ్ ది అకాడమీ ఆఫ్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్‌లో ప్రచురించబడిన క్రాస్ సెక్షనల్ అధ్యయనంలో ఎండిన పండ్లను తినని వ్యక్తుల కంటే ఎండిన పండ్లను తినే వ్యక్తులు అధిక ఆహార నాణ్యత మరియు పోషకాలను తీసుకుంటారని కనుగొన్నారు. ఆహారం తీసుకోవడం మెరుగుపరచడానికి పొటాషియం కలిగి ఉన్న డ్రైఫ్రూట్స్ వంటి ఆహారాలపై దృష్టి పెట్టడం ముఖ్యం. ఆ రోజుల్లో ఎక్కువ క్యాలరీలు తీసుకునే స్థాయిని కలిగి ఉన్నందున దానికి డ్రై ఫ్రూట్స్ జోడించేటప్పుడు జాగ్రత్త వహించాలి. డయాబెటిక్ రోగులకు డ్రై ఫ్రూట్స్ ఎలా ఎంచుకోవాలి? జోడించిన చక్కెర మొత్తం కోసం ప్యాకెట్‌లోని పట్టికను తనిఖీ చేయండి. ఇందులో 0 ఉండాలి. ఇతర జోడించిన పదార్థాలను చూసిన తర్వాత పదార్థాలను రక్షించడానికి సంరక్షణకారుల కోసం కూడా తనిఖీ చేయండి. తాజాదనాన్ని కాపాడుకోవడానికి సుక్రోజ్, ఫ్రక్టోజ్ కార్న్ సిరప్ లేదా ప్రత్యామ్నాయ జోడించిన చక్కెర మూలం జోడించబడిందని నిర్ధారించుకోండి. మీకు అవసరమైన ప్రయోజనాలను పొందడానికి, పోషకాలు అధికంగా ఉండే పోషకమైన ఆహారాన్ని అనుసరించండి. చక్కెర తక్కువగా ఉండే డ్రై ఫ్రూట్స్ ఏమిటి? బాదం మధుమేహ వ్యాధిగ్రస్తులకు గింజల విషయానికి వస్తే, బాదంపప్పులు మొదటి స్థానంలో ఉన్నాయి. మధుమేహం ప్రారంభ దశలో ఉన్నవారికి మరియు అధిక రక్తంలో చక్కెర ఉన్నవారికి బాదం ఒక అద్భుతమైన చిరుతిండి. ఎందుకంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బాదంపప్పులో ఫైబర్, విటమిన్ ఇ, మెగ్నీషియం మరియు విటమిన్ బి12 కూడా పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది ఆరోగ్యకరమైన చిరుతిండి. పిస్తాపప్పు పిస్తాలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులు, ముఖ్యంగా టైప్-2 మధుమేహ వ్యాధిగ్రస్తులు పిస్తాలను స్నాక్స్‌గా తినవచ్చు. పిస్తాలో ఫైబర్ మరియు ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా పుష్కలంగా ఉంటాయి. టైప్-2 మధుమేహ వ్యాధిగ్రస్తులు 4 వారాల పాటు పిస్తాపప్పులు తీసుకుంటే, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు గణనీయంగా తగ్గాయని మరియు మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయని ఒక అధ్యయనం కనుగొంది. కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులు రోజూ కొద్దిగా పిస్తా తినవచ్చు. అక్రోట్లను వాల్‌నట్స్‌లో ఒమేగా-3లు పుష్కలంగా ఉండే అద్భుతమైన గింజలు. ఈ వాల్‌నట్స్‌లో ప్రొటీన్‌తో పాటు పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు కూడా ఉంటాయి. వాల్‌నట్స్‌లోని బహుళఅసంతృప్త కొవ్వులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి మరియు తద్వారా ఆకలిని అణిచివేస్తాయి. కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది అద్భుతమైన చిరుతిండిని చేస్తుంది. జీడిపప్పు జీడిపప్పు అత్యంత ప్రాచుర్యం పొందిన గింజలలో ఒకటి. ఈ జీడిపప్పులో యాంటీ డయాబెటిక్ గుణాలు ఉన్నాయి. జీడిపప్పులో కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికీ మధుమేహ వ్యాధిగ్రస్తులకు మేలు చేసే మంచి కొవ్వులు. రోజూ జీడిపప్పును కొద్ది మొత్తంలో తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ప్రధానంగా జీడిపప్పు రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. వేరుశెనగ వేరుశెనగ ఒక చవకైన గింజ. ఈ వేరుశెనగలో ప్రోటీన్లు, కొవ్వులు మరియు ఫైబర్ అధికంగా ఉంటాయి మరియు తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటాయి, ఇవి మధుమేహ వ్యాధిగ్రస్తులకు అద్భుతమైన చిరుతిండి. గమనిక: గింజలు ప్రయోజనకరమైన పోషకాలతో నిండిన ఆరోగ్య ఆహార పదార్థం అయినప్పటికీ, గుండె జబ్బులు, కొలెస్ట్రాల్ సమస్యలు మరియు అధిక రక్తపోటు ఉన్నవారు తమ రోజువారీ ఆహారంలో గింజలను చేర్చుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. అలా కాకుండా, ఏదైనా ఆరోగ్యకరమైన ఆహారాన్ని మితంగా తీసుకుంటే మాత్రమే ప్రయోజనకరంగా ఉంటుంది.

# మీరు రెగ్యులర్ గా లిప్ స్టిక్ వేసుకుంటారా? ఐతే ముందు ఇది తెలుసుకోండి.

అందమైన పెదవులు ఉండాలనేది ప్రతి ఒక్కరి కోరిక. ముఖ్యంగా మహిళలు తమ పెదాలను అందంగా మార్చుకోవడానికి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. మహిళలు తమ దుస్తులు, వారి శైలి ఆధారంగా తమ లిప్‌స్టిక్‌ను ఎంచుకుంటారు. నిత్యం లిప్ స్టిక్ వాడే మహిళలు మనలో చాలా మంది ఉన్నారు. అయితే లిప్‌స్టిక్‌ను ఇష్టపడే మహిళలకు కొన్ని చేదువార్త. లిప్‌స్టిక్‌ను రెగ్యులర్‌గా అప్లై చేయడం వల్ల కొన్ని సైడ్ ఎఫెక్ట్‌లు రావచ్చు. ఎందుకంటే లిప్‌స్టిక్‌లో మానవులకు హాని కలిగించే మరియు అనేక ఆరోగ్య సమస్యలను కలిగించే అనేక ప్రమాదకరమైన పదార్థాలు ఉన్నాయి. కాబట్టి లిప్ స్టిక్ ఎంత ప్రమాదకరమో తెలుసుకుందాం.రోజూ నీళ్లలో నానబెట్టిన 4 ఎండు ఖర్జూరాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు! లిప్ స్టిక్ శరీరంలోకి శోషించబడుతుందని మీకు తెలుసా? లిప్ స్టిక్ వాడే వారు పొరపాటున చాలాసార్లు మింగేస్తారు. ఇది అల్యూమినియం, క్రోమియం మరియు మాంగనీస్ వంటి హానికరమైన పదార్థాలను శరీరంలోకి ప్రవేశిస్తుంది. అందువల్ల, మీ లిప్‌స్టిక్ మంచి నాణ్యతతో మరియు అటువంటి ప్రమాదకరమైన పదార్థాలు లేకుండా ఉండేలా చూసుకోవడం చాలా ముఖ్యం. పొడి మరియు పగిలిన పెదవులు లిప్ స్టిక్ పెదవులు పొడిబారడంతోపాటు పగిలిపోయేలా చేస్తుంది. మీరు దీన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. ఎక్స్‌ఫోలియేషన్ మరియు మాయిశ్చరైజింగ్ వంటి రెగ్యులర్ లిప్ కేర్ రొటీన్‌లు లిప్‌స్టిక్ వాడకం వల్ల ఏర్పడే పొడిని నిరోధించడంలో సహాయపడతాయి. మామిడి పండును ఎక్కువగా తింటే ఈ ఆరోగ్య సమస్యలు తప్పవు జాగ్రత్త! అలర్జీలు దీని సంభావ్యత ఎక్కువగా ఉన్నప్పటికీ, అలెర్జీ ప్రతిచర్యలు చాలా అరుదు. ప్రసిద్ధ సౌందర్య సాధనాల కంపెనీలు కఠినమైన భద్రతా విధానాలను అనుసరిస్తాయి. ప్రతికూల ప్రతిచర్యల సంభావ్యతను తగ్గించడానికి వారు తమ ఉత్పత్తులను క్షుణ్ణంగా పరీక్షించేలా చూస్తారు. కాబట్టి ప్రమాదకరమైన పదార్థాలు లేని లిప్‌స్టిక్‌ను ఉపయోగించడం మంచిది. పిగ్మెంటేషన్ లిప్ స్టిక్ వేసుకోవడం వల్ల పెదవుల సహజ రంగు మారిపోతుందని కొందరు ఆందోళన చెందుతుంటారు. అయినప్పటికీ, పెదవి పిగ్మెంటేషన్‌ను నిర్ణయించడంలో జన్యుశాస్త్రం మరియు జఎ ఎక్స్పోజర్ ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. లిప్‌స్టిక్‌తో కూడా, మంచి సన్‌స్క్రీన్ పెదవుల సహజ రంగును నిలుపుకోవడంలో సహాయపడుతుంది. ఓఎబిష్త్రబ ఒనిట ఈజీఇబిబ: నేను యంగ్.. నాకస్సలే రక్తపోటు రాదని అనుకుంటున్నారా? తీవ్రమైన ఆరోగ్య సమస్యలు అరుదైన సందర్భాల్లో, లిప్‌స్టిక్ వల్ల కళ్ల దురద, ఉక్కిరిబిక్కిరి చేయడం మరియు ఇతర శ్వాసకోశ సమస్యలను కలిగించడం ద్వారా వినియోగదారుని తీవ్రంగా హాని చేయవచ్చు. కొన్ని లిప్‌స్టిక్ బ్రాండ్‌లు క్యాన్సర్‌కు కారణమవుతాయి కాబట్టి జాగ్రత్తగా వాడండి. అంటువ్యాధులు లిప్‌స్టిక్‌లలో కనిపించే కొన్ని ప్రమాదకరమైన రసాయనాలు శరీర అవయవాలను దెబ్బతీసి ప్రమాదకరమైన ఇన్‌ఫెక్షన్‌లను వ్యాప్తి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. అధిక కాడ్మియం గాఢత మూత్రపిండాల వైఫల్యానికి దారితీస్తుంది. కాబట్టి మీరు వాడే లిప్ స్టిక్ లో కాడ్మియం తక్కువగా ఉండేలా చూసుకోండి. లిప్‌స్టిక్ యొక్క దుష్ప్రభావాలను ఎలా నివారించాలి? ×లిప్‌స్టిక్‌ల వల్ల ఏర్పడే పొడి పెదాలను వదిలించుకోవడానికి మీ పెదవులపై చక్కెర మరియు తేనెను అప్లై చేయండి. ×ప్రఖ్యాత బ్రాండ్లు మరియు విశ్వసనీయ లిప్‌స్టిక్‌లను మాత్రమే కొనుగోలు చేయండి మరియు వాటిలో రసాయనాలు లేవని నిర్ధారించుకోండి.



# మీ శరీరంలో అకస్మికంగా ఈ మార్పులు కనబడితే మీ బ్లడ్ షుగర్ లెవెల్ ఎక్కువే...జాగ్రత్త సుమా!




మధుమేహం గురించిన అవగాహన మనలో చాలా తక్కువగా ఉంది, నిజానికి మనం అనేక అపోహలను నమ్ముతాము. ప్రపంచవ్యాప్తంగా మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య నిరంతరం పెరగడానికి ఇదే ప్రధాన కారణం. మధుమేహం తరచుగా మూత్రవిసర్జన, నెమ్మదిగా గాయం మానడం మరియు అలసట వంటి లక్షణాలతో ఉంటుంది. దురదృష్టవశాత్తు, చాలామంది ఈ లక్షణాలను విస్మరిస్తారు మరియు వ్యాధి పురోగతికి అనుమతిస్తారు. మధుమేహంతో సంబంధం ఉన్న కొన్ని అసాధారణ లక్షణాలు ఉన్నాయి. ఈ లక్షణాలను గుర్తించడం ద్వారా, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించవచ్చు. అవి ఏమిటో ఈ పోస్ట్‌లో చూద్దాం. మెడ నల్లబడటం మెడపై చర్మం మందంగా మరియు నల్లగా ఉండటం మధుమేహానికి సంకేతం. ఈ చర్మం కొన్నిసార్లు గరుకుగా మారుతుంది. అకాంథోసిస్ నైగ్రికన్స్ అని పిలువబడే ఈ పరిస్థితి గజ్జ మరియు చంకలలో కూడా కనిపిస్తుంది. ఓఎబిష్త్రబ ఒనిట ఈజీఇబిబ: నేను యంగ్.. నాకస్సలే రక్తపోటు రాదని అనుకుంటున్నారా సువాసన శ్వాస మధుమేహం యొక్క మరొక సమస్య ఫల శ్వాస, దీనిని వైద్యపరంగా డయాబెటిక్ కీటోయాసిడోసిస్ అంటారు. శరీరం ఇన్సులిన్‌ను ఉపయోగించలేనప్పుడు అది శక్తి కోసం కొవ్వును విచ్ఛిన్నం చేస్తుంది మరియు ప్రక్రియలో కీటోన్‌లు విడుదలవుతాయి. రక్తంలో కీటోన్లు అధికంగా ఉండటం వల్ల శ్వాసలో అసిటోన్ వాసన లేదా పండ్ల వాసన వస్తుంది. ఎండిన నోరు నోరు పొడిబారడం మధుమేహం యొక్క అసాధారణ లక్షణం. అధిక రక్త చక్కెర లాలాజల స్రావాన్ని తగ్గిస్తుంది, కాబట్టి నోరు పొడిబారుతుంది. ఫలితంగా, నోటిలో చాలా తక్కువ లాలాజలం స్రవిస్తుంది. ఇది దంతాలు మరియు చిగుళ్ళకు కూడా ప్రమాదాన్ని కలిగిస్తుంది. :ఈ రోజుధనుస్సు, మకరం మరియు కుంభంతో సహా ఈ మూడు రాశుల వ్యక్తులు శుభవార్త పొందవచ్చు వికారం వికారం మరియు వాంతులు ఆరోగ్య సమస్యలకు శరీరం యొక్క సాధారణ ప్రతిచర్య. ముఖ్యంగా, ఇది మధుమేహం యొక్క ప్రధాన లక్షణం. మధుమేహం శరీరం యొక్క జీర్ణ సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. అధిక రక్త చక్కెర గ్యాస్ట్రోపరేసిస్‌కు కారణమవుతుంది, ఇది మీరు ఆహారాన్ని జీర్ణం చేసే విధానాన్ని ప్రభావితం చేస్తుంది. కాలులో విపరీతమైన నొప్పి కాళ్లు లేదా పాదాలలో నొప్పి అనేది ఒక వ్యక్తికి రక్తంలో చక్కెర అధికంగా ఉండవచ్చని సంకేతం. మధుమేహం, లేదా డయాబెటిక్ న్యూరోపతి వల్ల కలిగే నరాల నష్టం, అవయవాలలో నొప్పి లేదా తిమ్మిరికి దారితీస్తుంది. చాలా మంది వ్యక్తులు తమ అవయవాలలో మంటను అనుభవిస్తారు. తాబేలు ఉంగరం ధరించేటప్పుడు ఈ తప్పులు చేయకూడదు పునరావృత అంటువ్యాధులు మధుమేహం వ్యాధికారక క్రిములకు వ్యతిరేకంగా పోరాడటానికి శరీరం యొక్క రోగనిరోధక వ్యవస్థను ప్రభావితం చేస్తుంది మరియు శరీరంలో ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని పెంచుతుంది. అధిక రక్తంలో చక్కెర స్థాయిలు శరీరాన్ని వ్యాధులకు గురి చేస్తాయి. జననేంద్రియ ఇన్ఫెక్షన్లు, ఈస్ట్ ఇన్ఫెక్షన్లు, మూత్రాశయ ఇన్ఫెక్షన్లు మీరు బాధపడే కొన్ని రకాల ఇన్ఫెక్షన్లు.

# గ్రీన్ టీ లేదా బ్లాక్ టీ తాగితే మధుమేహం తగ్గుతుందా? అధ్యయనం ఏం చెబుతోంది?

మీరు పదేళ్లుగా గ్రీన్ టీ లేదా బ్లాక్ టీ తాగుతూ ఉంటే, మీకో శుభవార్త. మీరు బ్లాక్ టీ లేదా గ్రీన్ టీ తాగకపోతే, మీరు ఈ రోజు నుండి గ్రీన్ టీ లేదా బ్లాక్ టీ తాగడం ప్రారంభించవచ్చు. అవును, ఈ గ్రీన్ మరియు బ్లాక్ టీ మీ మధుమేహాన్ని తగ్గిస్తుంది. మధుమేహం కారణంగా ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతున్నారు మరియు దేశవ్యాప్తంగా డయాబెటిస్ ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పుడు టీ తాగే అలవాట్లలో చిన్న మార్పు ఈ వ్యాధి నుండి కొంతవరకు మనలను రక్షించగలదని అధ్యయనం కనుగొంది.రోజూ నీళ్లలో నానబెట్టిన 4 ఎండు ఖర్జూరాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు! ఈ కొత్త అధ్యయనం ప్రకారం, నాలుగు సిప్స్ బ్లాక్ గ్రీన్ లేదా బ్లాక్ టీ, ఊలాంగ్ (ఒక సాంప్రదాయ చైనీస్ పానీయం లేదా టీ) టీ టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎనిమిది దేశాలలో ఒక మిలియన్ కంటే ఎక్కువ మంది పెద్దలపై చేసిన అధ్యయనంలో ఇది కనుగొనబడింది. రచయిత చీఎతినిణ ఒతి చెప్పారు: చైనాలోని వుహాన్ యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన ప్రముఖ రచయిత జింగ్ లీ మాట్లాడుతూ, "టైప్-2 డయాబెటిస్‌ను నివారించడానికి ప్రజలు రోజుకు నాలుగు కప్పుల టీ తీసుకోవడం తగ్గించవచ్చని మా ఫలితాలు ఆశ్చర్యపరిచాయి. ఈ అధ్యయనం వార్షికోత్సవంలో ప్రదర్శించబడుతుంది. స్వీడన్‌లో యూరోపియన్ అసోసియేషన్ ఫర్ ది స్టడీ ఆఫ్ డయాబెటిస్ (ఇయాఆ) సమావేశం త్వరలో నిర్వహించబడుతుంది. మామిడి పండును ఎక్కువగా తింటే ఈ ఆరోగ్య సమస్యలు తప్పవు జాగ్రత్త! టీ యొక్క లక్షణాలు ఏమిటి? టీలోని వివిధ యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు యాంటీ కార్సినోజెనిక్ సమ్మేళనాలు కారణంగా, టీని క్రమం తప్పకుండా తాగడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని కొన్ని అధ్యయనాల్లో తేలింది. కానీ మధుమేహం ప్రమాదానికి మధ్య లింక్ ఏర్పడటం ఇదే మొదటిసారి. ఒక మిలియన్ జనాభా యొక్క విశ్లేషణ ప్రకారం, రోజుకు తీసుకునే ప్రతి కప్పు టీ మధుమేహం వచ్చే ప్రమాదాన్ని 1 శాతం తగ్గిస్తుంది. మరో సంబంధిత అధ్యయనం డయాబెటోలోజియా జర్నల్‌లో ప్రచురించబడింది. టీ తాగని పెద్దలతో పోలిస్తే, రోజుకు 1-3 కప్పుల టీ తాగేవారిలో మధుమేహం వచ్చే ప్రమాదం 4 శాతం తక్కువగా ఉండగా, రోజూ కనీసం 4 కప్పులు తాగేవారిలో 17 శాతం తక్కువ ప్రమాదం ఉంది.

# డయాబెటిస్‌తో హెయిర్ లాస్.. జుట్టు రాలకూడదంటే ఈ చిట్కాలు పాటించండి

ఈమధ్యకాలంలో వయస్సుతో సంబంధం లేకుండా చాలా మందిలో జుట్టు రాలుతోంది. చిన్న వయస్సు వారిలోనూ జుట్టు విపరీతంగా రాలుతోంది. జుట్టు రాలడానికి అనేక కారణాలు ఉంటాయి. సాధారణంగా ఒక రోజుకు 50 నుంచి 100 వెంట్రుకలు రాలితే అది చాలా సాధారణం. దానికి చింతించాల్సిన అవసరం లేదు. కానీ, కొందరిలో విపరీతంగా జుట్టు రాలుతుంది. జుట్టు రాలడానికి మధుమేహం కూడా ఓ కారణమని వైద్యులు చెబుతున్నారు. మధుమేహం జుట్టు రాలిపోవడానికి కారణం! మధుమేహం అనేది దీర్ఘకాలిక, జీవక్రియ వ్యాధి. ఇది రక్తంలో గ్లూకోజ్ లేదా రక్తంలో చక్కెర అధిక స్థాయిల ద్వారా వర్గీకరించబడుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పిన దాని ప్రకారం.. మధుమేహం వల్ల కాలక్రమేణా కళ్లు, గుండె, మూత్రపిండాలు, రక్త నాళాలు, నరాలకు తీవ్ర నష్టం కలుగుతుంది. జుట్టు రాలడానికి డయాబెటిస్ ఎలా కారణం అవుతుందో ఇప్పుడు తెలుసుకుందాం. రోజూ నీళ్లలో నానబెట్టిన 4 ఎండు ఖర్జూరాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు! 1. బలహీనమైన రక్త ప్రసరణ: రక్తంలో అధిక చక్కెర స్థాయిలు రక్తనాళాలను దెబ్బతీస్తాయి. తలకు రక్త ప్రసరణను తగ్గిస్తాయి. ఆరోగ్యకరమైన జుట్టు పెరుగుదలకు అవసరమైన పోషకాలు, ఆక్సిజన్ ను జుట్టు కుదుళ్లకు అందకుండా చేస్తుంది. 2. హార్మోన్ల అసమతుల్యత: మధుమేహం జుట్టు రాలడానికి దారితీసే హార్మోన్ల అసమతుల్యతకు కారణం అవుతుంది.

# నా ఆందోళనంతా ఆ ఆల్‌రౌండర్ గురించే: కపిల్ దేవ్



వన్డే ప్రపంచకప్-2023 షెడ్యూల్ వచ్చేసింది. అక్టోబర్ 5వ తేదీ నుంచి వరల్డ్ కప్ సంగ్రామం ప్రారంభంకానుంది.దాదాపు వంద రోజుల సమయం ఉంది. ఈలోగా టీమ్‌ఇండియా వెస్టిండీస్ పర్యటన, ఆసియా కప్, ఐర్లాండ్ సిరీస్‌లను ఆడనుంది. అయితే, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, జస్ప్రీత్ బుమ్రా వంటి టాప్ ప్లేయర్లు గాయాలబారిన పడ్డారు. ప్రస్తుతం కోలుకుంటున్నప్పటికీ వన్డే వరల్డ్ కప్ నాటికి ఫిట్‌నెస్ సాధించి ఫామ్ అందుకొంటారో లేదోననే ఆందోళన అభిమానుల్లో ఉంది. అయితే, టీమ్‌ఇండియా క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ మాత్రం ఒకే ఒక్క ఆటగాడి ఫామ్‌పై ఆందోళన వ్యక్తం చేశాడు. అతడే పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య 'ప్రతి క్రీడాకారుడి జీవితంలో గాయాలు ఓ భాగం. అయితే, వేగంగా కోలుకుని మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టాలి. ఇప్పటికే కొందరు కీలక ఆటగాళ్లు గాయపడ్డారు. కానీ, హార్దిక్ పాండ్య గురించే చాలా ఆందోళనగా ఉన్నా. భవిష్యత్తులో ఎలా ఆడతాడనేది వేచి చూడాలి. ఎందుకంటే అతడు త్వరగా గాయాలబారిన పడుతున్నాడు. ఒకవేళ ఆటగాళ్లందరూ ఫిట్‌గా ఉంటే మాత్రం టీమ్‌ఇండియా తప్పకుండా వరల్డ్ కప్‌లో అద్భుతంగా రాణిస్తుంది. ఈ మెగా టోర్నీ ప్రతి నాలుగేళ్లకొకసారి వస్తుంది. అందుకే ప్రతి ఆటగాడు సిద్ధంగా ఉండాలి. మ్యాచ్‌ల కోసం ఎక్కువగా సాధన చేయాలి. మరిన్ని వన్డేలను ఆడాలి" అని కపిల్ దేవ్ తెలిపాడు."రిషభ్ పంత్ గాయాల పరిస్థితి ఏంటో మనకు తెలియదు. రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న పంత్ కోలుకుని ఆడగలిగితే వన్డే ప్రపంచకప్‌లో భారత్‌కు తిరుగుండదు. అయితే, అతడి ఫిట్‌నెస్ పరిస్థితి ప్రశ్నార్థకం. వన్డే ప్రపంచకప్ నాటికి ఫిట్ అవుతాడో లేదో ఎవరికీ తెలియదు. మెగా టోర్నీలో ఆడటంపైనా అనేక మందికి అనుమానం ఉంది. రిషభ్ జట్టులో ఉంటే అతడి ప్రభావం అధికంగా ఉంటుందనేది కాదనలేని సత్యం. కేఎల్ రాహుల్ జట్టులోకి వస్తాడని ఆశిస్తున్నా. మిడిలార్డర్‌లో తప్పకుండా కీలకమవుతాడు. రోహిత్ శర్మ - శుభ్‌మన్ గిల్ ఓపెనర్లుగా వస్తారు. ఆ తర్వాత విరాట్ కోహ్లీ ఫామ్‌లోనే ఉన్నాడు. వరల్డ్ కప్ నెగ్గడానికి భారత్‌కు ఎక్కువ అవకాశాలున్నాయి" అని మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ (క్రిష్) వ్యాఖ్యానించాడు.

# ద్రవిడ్‌కు మద్దతుగా సెహ్వాగ్.. గ్యారీ కిరిస్టెన్‌ను ప్రస్తావించిన డ్యాషింగ్ బ్యాటర్!



ఇటీవల ముగిసిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లోనూ భారత్ ఓటమిపాలైన సంగతి తెలిసిందే. రాహుల్ ద్రవిడ్ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జరిగిన టీ20 ప్రపంచకప్ (ఆసియా కప్, డబ్ల్యూటీసీ ఫైనల్‌లో టీమ్‌ఇండియాకు ఓటమి తప్పలేదు.దీంతో అతడి కోచింగ్ శైలిపై విమర్శలు రేగాయి. ఈ క్రమంలో భారత మాజీ డ్యాషింగ్ ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్ తన సహచరుడికి మద్దతుగా నిలిచాడు. అయితే, వన్డే ప్రపంచకప్ 2011 టైటిల్‌ను నెగ్గిన భారత్ జట్టుకు కోచ్‌గా పని చేసిన గ్యారీ కిరిస్టెన్ ప్రస్తావన తీసుకురావడం విశేషం."ఆటగాళ్ల ప్రదర్శనపైనే కోచ్ కీర్తి ప్రతిష్ఠలు ఆధారపడి ఉంటాయి. ఒక్కసారి వారు మైదానంలోకి దిగి మంచి ప్రదర్శన చేస్తే కోచ్‌ను అభినందిస్తారు. అలాగే ఓడితే విమర్శిస్తారు. మనం డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరాం. కానీ, ఓటమి చవిచూశాం. ప్రతి ఒక్కరూ పరాజయం గురించి మాత్రమే మాట్లాడతారు. మనం ఇక్కడ వరకు ఎలా వచ్చామనేది పట్టించుకోరు. రాహుల్ ఉత్తమ కోచ్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, మైదానంలోకి దిగిన తర్వాత ఆటగాళ్లే సరిగ్గా ఆడాలి. మీరు ఒకసారి 2011 ప్రపంచ కప్ సమయంలోని టీమ్‌ఇండియా కోచ్‌ను గుర్తు చేసుకోవాలి. భారత్‌ను విజేతగా నిలిపిన గ్యారీ కిరిస్టెన్ ఆ తర్వాత చాలా జట్లకు కోచింగ్ బాధ్యతలు నిర్వర్తించాడు. కానీ, ఒక్కసారి కూడా ఛాంపియన్‌గా నిలపలేకపోయాడు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు కప్ అందించాడు. అయితే, ఇక్కడ కిరిస్టెన్ కంటే ఆశిశ్ నెహ్రా చాలా కష్టపడ్డాడు. మ్యాచుల సందర్భంగా మనం టీవీల్లోనూ చూశాం" అని సెహ్వాగ్ వ్యాఖ్యానించాడు. ద్రవిడ్ - రోహిత్ కాంబినేషన్‌లో వన్డే ప్రపంచకప్‌ను నెగ్గి ఐసీసీ ట్రోఫీ కోసం పదేళ్లుగా ఉన్న నిరీక్షణకు తెరదించాలని అభిమానులు ఆశిస్తున్నారు."రాబోయే వన్డే ప్రపంచకప్‌లో నాలుగు జట్లు సెమీస్ చేరేవేంటో చెబుతా. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్, పాకిస్థాన్. అయితే, అందులో రెండు జట్లు మాత్రం తప్పకుండా ఉంటాయి. అవి ఆసీస్, ఇంగ్లాండ్. ఎందుకంటే ఇరు జట్లు ఆడే విధానం ఆ స్థాయిలో ఉంది. మిగతా రెండు వచ్చే అవకాశాలు ఎక్కువే. కానీ, అద్భుతాలు జరిగితే ఇప్పుడేం చెప్పలేం" అని సెహ్వాగ్ చెప్పాడు."ప్రపంచకప్‌లో భారత్ - ఇంగ్లాండ్ మ్యాచ్ చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. భారత్ నిస్సందేహంగా ఫేవరేట్. ఎందుకంటే వారి స్వదేశంలో టోర్నీని ఆడబోతోంది. అందుకే, ఇంగ్లాండ్‌తో పోరు చాలా ఆసక్తికరంగా ఉంటుంది'' అని ముత్తయ్య తెలిపాడు. భారత్ - ఇంగ్లాండ్ జట్ల మధ్య అక్టోబర్ 29న లఖ్‌నవూ వేదికగా మ్యాచ్ జరగనుంది

# అందుకే ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొస్తాడని తెలుసు..: ముత్తయ్య



ఈ తరం భారత క్రికెట్ అభిమానులకు చిరస్మరణీయంగా గుర్తుండిపోయే సిక్స్ ఏదంటే.. ఠక్కున గుర్తుకొచ్చేది ఒకటే. అదే వన్డే ప్రపంచకప్-2011 ఫైనల్‌లో శ్రీలంకపై నాటి కెప్టెన్ ఎంఎస్ ధోనీ బాదిన సిక్స్.ఎందుకంటే దాదాపు 28 ఏళ్ల తర్వాత మరోసారి టీమ్‌ఇండియాకు వన్డే వరల్డ్ కప్ దక్కిన సందర్భం అది. సాధారణంగా లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చే 'కెప్టెన్ కూల్' ఆ ఇన్నింగ్స్‌లో మాత్రం ఒక స్థానం ముందుకొచ్చి థర్డ్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగాడు. వాస్తవానికి ఆ స్థానంలో అప్పటికే మంచి ఫామ్‌లో ఉన్న యువరాజ్ సింగ్ రావాల్సి ఉంది. కానీ, అతడిని కాదని ధోనీ ముందుకొచ్చి కేవలం 79 బంతుల్లోనే 91 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. ఈ క్రమంలో ధోనీ ముందుకు రావడానికిగల ప్రధానం కారణం గురించి శ్రీలంక క్రికెట్ దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ తాజాగా వెల్లడించాడు. వన్డే ప్రపంచకప్ 2023 షెడ్యూలింగ్ ఈవెంట్‌లో గత జ్ఞాపకాలను మాజీలు గుర్తు చేసుకుంటున్నారు. అందులో భాగంగా 2011 ఫైనల్ గురించి ముత్తయ్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.బ్యాటింగ్ ఆర్డర్‌లో యువీని కాదని ధోనీ ముందుకొస్తాడని తాము ముందే అంచనా వేశామని ముత్తయ్య వ్యాఖ్యానించాడు. ''నా బౌలింగ్‌లో యువరాజ్ ఇబ్బంది పడేవాడు. యువీ అత్యుత్తమ క్రికెటర్ అనడంలో సందేహం లేదు. మిడిల్‌ఆర్డర్‌లో అతడు కీలక పాత్ర పోషించాడు. కానీ, నా బౌలింగ్‌లో ఇబ్బంది పడిన సందర్భాలున్నాయి. దీంతో ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చాడు. అలా ఎందుకు వచ్చాడో కూడా మాకు తెలుసు. ఐపీఎల్ సందర్భంగా ధోనీకి నెట్స్‌లో ఎక్కువగా బంతులు వేశా. అతడికి నా బౌలింగ్‌పై మంచి అవగాహన ఉంది. దీంతో నాకు వికెట్ ఇవ్వకూడదనే కృతనిశ్చయంతో అతడే ముందుకు వచ్చాడు. నాకు ఆ మ్యాచ్‌లో వికెట్ దక్కకపోయినా పొదుపుగానే బౌలింగ్ చేశా.వాంఖడే స్టేడియంలో తేమ ప్రభావం ఎక్కువగా ఉంది. ఎక్కువగా బంతిని స్పిన్ చేయలేకపోయాం. ఒక ఎండ్‌లో గౌతమ్ గంభీర్ ఉన్నాడు. ఆ సమయంలో వికెట్ పడితే తప్పకుండా రైట్‌హ్యాండ్ బ్యాటర్ అయిన ధోనీ వస్తాడని ముందే అంచనా వేశాం" అని ముత్తయ్య మురళీధరన్ తెలిపాడు. ఫైనల్ మ్యాచ్‌లో మురళీ 8 ఓవర్లు వేసి వికెట్ లేకుండా 39 పరుగులు ఇచ్చాడు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 274/6 స్కోరు సాధించగా.. భారత్ నాలుగు వికెట్ల నష్టానికి 48.2 ఓవర్లలో 277 పరుగులు చేసి విజయం సాధించింది.

# సీన్ రివర్స్ అయినట్టుందే!.. ఇంగ్లండ్‌కు దిమ్మతిరిగే షాక్

ఇంగ్లండ్ జట్టు బజ్‌బాల్ ఆటతీరుతో వరుసగా సిరీస్‌లు గెలిచిన సంగతి తెలిసిందే. స్టోక్స్ కెప్టెన్‌గా.. మెక్‌కల్లమ్ కోచ్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఇంగ్లండ్ జట్టు 13 టెస్టుల్లో 11 విజయాలు సాధించింది.అన్నింటిలోనూ బజ్‌బాల్ ఆట దూకుడునే ప్రదర్శిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలోనే పాకిస్తాన్, న్యూజిలాండ్, సౌతాఫ్రికా జట్లను మట్టికరిపించి సిరీస్ విజయాలను సొంతం చేసుకుంది. ఇక యాషెస్ టెస్టు సిరీస్ ప్రారంభానికి ముందు కూడా ఇంగ్లండ్ జట్టు తమ బజ్‌బాల్ దూకుడు కొనసాగుతుందని స్పష్టం చేసింది.అందుకు తగ్గట్టుగానే ఆసీస్‌తో తొలి టెస్టులో తొలి ఇన్నింగ్స్‌ను ఒక్కరోజులోనే డిక్లేర్ చేసింది. అయితే ప్రతీసారి మనది కాదని తెలుసుకోని ఇంగ్లండ్ ప్రపంచ టెస్టు చాంపియన్ అయిన ఆస్ట్రేలియాకు తలవంచింది. తొలి టెస్టులో ఆస్ట్రేలియా రెండు వికెట్ల తేడాతో సంచలన విజయం సాధించింది. అయితే ఇంగ్లండ్ బౌలర్లు ఐదోరోజు సూపర్‌గా బౌలింగ్ చేసినప్పటికి పాట్ కమిన్స్, నాథన్ లయోన్‌ల అద్భుత పోరాటం ఇంగ్లండ్‌కు విజయాన్ని దూరం చేసింది. కానీ ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ మాత్రం బజ్‌బాల్ ఆటను సమర్థించుకున్నాడు. ఒక్క టెస్టులో ఓడిపోయినంత మాత్రానా బజ్‌బాల్‌ను పక్కనపెట్టేదే లేదని కుండబద్దలు కొట్టాడు.అయితే బుధవారం(జూన్ 28న) లార్డ్స్ వేదికగా మొదలైన రెండో టెస్టులో సీన్ మొత్తం రివర్స్ అయింది. బజ్‌బాల్ ఆటతో దూకుడు కనబరుస్తామనుకున్న ఇంగ్లండ్‌కు ఆసీస్ దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. ఎందుకంటే తొలిరోజు ఆటలో ఆస్ట్రేలియా వేగంగా ఆడింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఇలాగే ఆడుతామంటూ బజ్‌బాల్ ఆటను ఇంగ్లండ్‌కు చూపించింది.డేవిడ్ వార్నర్, ట్రెవిస్ హెడ్‌లు వన్డే స్టైల్లో వేగంగా ఆడితే.. స్మిత్ ఎప్పటిలాగే తన నిలకడైన ఆటను ప్రదర్శిస్తూ 85 పరుగులతో నాటౌట్‌గా నిలిచి సెంచరీకి దగ్గరయ్యాడు. ఓవర్‌కు 4.08 రన్‌రేట్‌తో 83 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. ఒక దశలో వార్నర్-లబుషేన్, ట్రెవిస్ హెడ్- స్మిత్ జోడి ఓవర్‌కు ఐదు పరుగుల చొప్పున జోడించారు. నిజంగా ఇది ఇంగ్లండ్ ఇది ఊహించలేదు.ఇక రెండోరోజు ఆటలో స్మిత్ సెంచరీ నుంచి డబుల్ సెంచరీ చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అలెక్స్ క్యారీ, లాస్ట్ మ్యాచ్ హీరో పాట్ కమిన్స్ ఇంకా బ్యాటింగ్‌కు రావాల్సి ఉంది. తొలి సెషన్‌లో వీరిని ఎంత త్వరగా ఔట్ చేస్తే ఇంగ్లండ్‌కు అంత మంచిది. రెండు సెషన్ల పాటు ఆసీస్ బ్యాటింగ్ చేస్తే మాత్రం 500 స్కోరు దాటే అవకాశం ఉంది. అప్పుడు ఇంగ్లండ్‌కు కష్టాలు మొదలైనట్లే. బజ్‌బాల్‌తో ప్రత్యర్థికి చుక్కలు చూపిద్దామనుకున్న ఇంగ్లండ్‌కు ఆస్ట్రేలియానే ముచ్చెమటలు పట్టించేలా కనిపిస్తోంది.




# శుభ్‌మన్ గిల్ వీడియో.. ఇషాన్ సూపర్ రియాక్షన్.. నెట్టింట వైరల్!



గత పదిహేను రోజులుగా టీమ్‌ఇండియా ఆటగాళ్లకు విరామం దొరికింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ముగిసినప్పటి నుంచి ఆటగాళ్లు వ్యక్తిగత పర్యటనల్లో ఉన్నారు.జులై 12వ తేదీ నుంచి విండీస్‌తో తలపడనుంది. ఈ క్రమంలో టీమ్‌ఇండియా యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ ఇటీవల పారిస్‌లోని ఫుట్‌బాల్ క్లబ్‌ను సందర్శించాడు. ఏడో నంబర్‌తో కూడిన జెర్సీని సదరు క్లబ్ గిల్‌కు బహూకరించింది. జెర్సీతో కూడిన వీడియోను గిల్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. అయితే, టీమ్‌ఇండియా మరో యువ బ్యాటర్ ఇషాన్ కిషన్ స్పందించిన తీరు నెటిజన్లను ఆకట్టుకుంది.గిల్ జెర్సీని ఉద్దేశించి ఇషాన్ స్పందిస్తూ.. "ఆ షర్ట్‌తోనే వెస్టిండీస్ పర్యటనకు వచ్చేయ్ బ్రదర్. ప్లీజ్ మరిచిపోవద్దు. దాని కోసం ప్రతి చోటా వెతికా" అని ఇషాన్ కిషన్ పోస్టుతోపాటు నవ్వుతున్న ఎమోజీలను పెట్టాడు. గిల్ వీడియోకు రెండు రోజుల్లోపే మిలియన్‌కుపైగా (12.40 లక్షలు) లైకులు వచ్చాయి.

# భారత్ చేతిలో ఓడినా సరే.. మాకు అదే ముఖ్యం: పాక్ స్టార్ క్రికెటర్

ఐసీసీ మెగా ఈవెంట్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. భారత్ వేదికగా అక్టోబరు 5- నవంబరు 19 వరకు వన్డే ప్రపంచకప్-2023 నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది.ఈ మేజర్ టోర్నీలో దాయాదులు భారత్- పాకిస్తాన్ మ్యాచ్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంను వేదికగా ఫిక్స్ చేసింది ఐసీసీ.అక్టోబరు 15న జరుగనున్న చిరకాల ప్రత్యర్థుల మధ్య మ్యాచ్‌ను వీక్షించేందుకు ప్రేక్షకులు పోటెత్తడం ఖాయం. ఇక టీ20 ప్రపంచకప్-2022 తర్వాత తొలిసారి భారత్- పాక్ ముఖాముఖి పోటీపడనున్న నేపథ్యంలో పాకిస్తాన్ ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.క్రికెట్ పాకిస్తాన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "టీమిండియాతో మ్యాచ్ అంటే ఎల్లప్పుడూ సంతోషంగానే ఉంటుంది. అదే స్థాయిలో ఒత్తిడి కూడా ఉంటుంది. ఇప్పుడు మేము భారత్‌కు వెళ్లాల్సి ఉంది.సొంతగడ్డపై మ్యాచ్ జరగడం వాళ్లకు కలిసి వస్తుంది. ప్రేక్షకుల మద్దతు కూడా వాళ్లకే ఉంటుంది. అయితే, మేము వరల్డ్‌కప్ లాంటి మేజర్ టోర్నీ ఆడేందుకు అక్కడికి వెళ్తున్నాం. కాబట్టి మా దృష్టి మొత్తం దానిమీదే ఉండాలి.కేవలం టీమిండియాను ఓడించడమే ప్రధాన లక్ష్యం కాదు. ఒకవేళ భారత జట్టును ఓడించినప్పటికీ మేము టైటిల్ గెలవలేదంటే ఎలాంటి ప్రయోజనం ఉండదు కదా! నా అభిప్రాయం ప్రకారం.. ఒకవేళ మేము టీమిండియా చేతిలో ఓటమిపాలైనా.. వరల్డ్‌కప్ గెలిస్తే అదే అసలైన విజయం.మా ప్రధాన లక్ష్యం కూడా అదే కావాలి" అని షాదాబ్ ఖాన్ పేర్కొన్నాడు. కాగా పాక్ పరిమిత ఓవర్ల క్రికెట్ జట్టులో కీలక సభ్యుడైన షాదాబ్ ఖాన్.. ప్రపంచకప్ ఈవెంట్ తర్వాత టెస్టు క్రికెట్‌పై కూడా దృష్టి సారించనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించాడు.




## క్వీన్ కంగన తో భారీ ప్రయోగం చేస్తున్న ప్రముఖ నిర్మాత




క్వీన్ కంగన వివాదాల కు కామా పెట్టి వరుస చిత్రాల తో బిజీ గా ఉంది. ప్రతిసారీ వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుని ప్రయోగాలు చేయడాన్ని విడవడం లేదు. చంద్రముఖి 2 - ఎమర్జెన్సీ లాంటి విలక్షణ చిత్రాల్లో తదుపరి కనిపించనుంది. కంగన నటిస్తూ స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'ఎమర్జెన్సీ' నవంబర్ లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇంత లోనే క్వీన్ మళ్లీ హెడ్ లైన్స్ లోకి వచ్చింది. ఈసారి వివాదాల తో కాకుండా మరో కొత్త క్రేజీ సినిమా లో నటిస్తున్నానని చెబుతూ వార్తల్లో వ్యక్తిగా మారింది. తన ఇన్ స్టాలో వెల్లడించిన సమాచారం మేరకు.. కంగన తదుపరి ప్రాజెక్ట్ లెజెండ్ స్టూడియోస్ లో ఉంటుంది. నిర్మాత సందీప్ సింగ్ 30 సంవత్సరాలుగా తెలుసు. కంగన కెరీర్ లోనే ఇది పెద్ద సినిమా. ఈ విషయాన్ని కంగన స్వయంగా ధృవీకరించారు. ఇందులో అద్భుతమైన పాత్రలో నటిస్తున్నానని తెలిపారు. తదుపరి వివరాలు త్వరలో తెలియజేస్తామన్నారు. క్వీన్ కంగన వీరాభిమానుల్లో ఉత్సాహం పెంచే వార్త ఇది. అయితే ఈ ప్రాజెక్ట్ గురించి మరింతగా తెలుసుకోవాలనే ఉత్కంఠ అభిమానుల్లో ఉంది.అలాగే ఈ భారీ చిత్రానికి కంగనా మణికర్ణిక ఫిల్మ్స్ సహనిర్మాణ సంస్థగా వ్యవహరిస్తుందని సమాచారం. మరోవైపు కంగన 'ఎమర్జెన్సీ' 24 నవంబర్ 2023న ప్రేక్షకుల ముందుకు రానుండగా.. అంతకంటే ముందే చంద్రముఖి విడుదలవుతుంది. ఈ సినిమా 15 సెప్టెంబర్ 2023న థియేటర్లలో విడుదల కానుంది.కొన్ని వరుస ఫ్లాపుల తో కెరీర్ పరంగా సతమతమవుతున్నా కంగన కు సినిమాల పరంగా అవకాశాల కు కొదవేమీ లేదు. తన ప్రతిభను నమ్మి అవకాశాలిచ్చే నిర్మాతలు పరిశ్రమలో కోకొల్లలు. వివాదాల రాణిగా పేరున్నా.. పరాజయాలతో సంబంధం లేకుండా ఎవరూ వెనకంజ వేయక అవకాశాలిస్తుండడం ఆశ్చర్యకరం.

## సేతుపతిని నీ ముఖానికి సినిమాలు అవసరమా అన్నారు!

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి నేడు ఇండియాలో బెస్ట్ పెర్ఫార్మెన్స్ లో ఒకరు. కోలీవుడ్ లో కమల్ హాసన్.. రజనీకాంత్ తర్వాత స్థానం మక్కల్ సెల్వన్ దే అని ముందే రాసిపెట్టేసారు. కమల్ హాసన్ తర్వాత అంత గొప్ప నటుడు కాగాలే లక్షణాలు అన్ని సేతుపతిలో ఉన్నాయని కోలీవుడ్ కోడై కూస్తుంటుంది. అన్ని పరిశ్రమల దర్శకులు విజయ్ కోసం అంటూ ఓ పాత్రనే సృష్టిస్తున్నారు.హీరోగా..విలన్ గా...క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా..ఎలాంటి పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేయగల నటుడాయన. అతని పోషించిన పాత్రలే సేతుపతిని ఆ స్థాయిలో నిలబెట్టాయి. సంతానం పాత్రతో పాన్ ఇండియాలోనే మరింత ఫేమస్ అయ్యారు. మరి ఆ నటుడు కెరీర్ ఆరంభంలో ఎలాంటి అవమానాలు ఎదుర్కున్నాడో తెలుసా? ఆ విషయాలు ఏంటో ఆయన మాటల్లోనే..'ఓ థియేటర్ గ్రూప్లో అకౌంటెంట్ గా పనిచేస్తూ సినిమా అవకాశాల కోసం ప్రయత్నాలు చేస్తుండేవాడిని. ఫోటోలు పట్టుకుని సినిమా ఆఫీస్ లు చుట్టూ తిరిగేవాడిని. నన్ను చూడగానే నీ ముఖానికి సినిమాలు కూడానా? అనేవారు. కొందరైతే నా ఫోటోలు చూడటానికి కూడా ఇష్టపడేవారు కాదు. మరికొంత మంది వేషం ఉందని చెప్పి సెట్స్ కి పిలిపించేవారు. తీరా ఆ పాత్ర నాకొస్తుంది అనుకునే లోపే మరోకరైతే చేయించేవారు.కెరీర్ ఆరంభంలో ఇలాంటి అవమానాలెన్నో ఎదుర్కున్నాను. కానీ ఏ రోజు నా ఆత్మ విశ్వాసాన్ని కోల్పోలేదు. ఎప్పటికైనా ప్రతిభే నిలబడుతుందని నమ్మకంతో ప్రయత్నాలు చేసేవాడిని. అలాగే కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నాను' అని అన్నారు.ఇప్పుడా విమర్శించిన నోళ్లు మూత పడ్డాయి. సార్ అంటూ వెంట పడేలా చేసుకున్నాడు. విమర్శించిన వాళ్లని తన ఆఫీస్ బయట వెయిట్ చేయించేలా ఎదిగాడు. ఎదగడం అంటే ఇది అని నిరూపించిన మరో నటుడు సేతుపతి. ట్యాలెంట్ ఉన్నోడ్ని ఎవరూ ఆపలేరని మరోసారి రుజువు చేసాడు.



## విమాన ప్రమాదంలో మరణానికి ముందు సౌందర్య చివరి కోరిక



దక్షిణ భారత సినీపరిశ్రమలో బంగారు వెలుగులు పరిచిన మేటి కథానాయికల్లో సౌందర్య ఒకరు. తనదైన అందం ఆకర్షణ స్క్రీన్ ప్రెజెన్స్ తో అసాధారణ ఫాలోవర్స్ ని సౌందర్య సంపాదించుకున్నారు. కానీ దురదృష్టవశాత్తు 17 ఏప్రిల్ 2004న విమాన ప్రమాదంలో మరణించారు. 27 ఏళ్ల పిన్న వయస్సులో మరణించిన నటిగా అభిమానుల హృదయాల్లో తీవ్ర విషాదం నింపారు.ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రోజున సౌందర్య తన మేనకోడలుతో ఏం చెప్పిందనే విషయం ఇప్పుడు వెల్లడైంది. కోడలుతో చివరి నిమిషంలో మాట్లాడిన సౌందర్య కాటన్ చీరలు కుంకుమ కావాల ని అడిగారని తెలిసింది. నిజానికి ఇది ఎవరూ ఊహించనిది కాదు. సాంప్రదాయానికి సంస్కారానికి ప్రతీకగా నాటి కథానాయికల్లో తనదైన శైలితో ఒదిగిపోయి నటించిన మేటి నటి సౌందర్య.దురదృష్టవశాత్తు విమాన ప్రమాదానికి ముందు తన కోడలు ను రెండు కోరికలు కోరారు. కాటన్ చీరలు - కుంకుమ కొనాల ని తన కోడలు కు సౌందర్య చెప్పింది. సౌందర్య దగ్గర అప్పటికి కాటన్ చీరలేవీ లేవు. అందుకే తన కోడలు నిర్మల ను ఒక చీర కొనమని చెప్పింది. తన కోడలు కూడా బిజెపి లో చేరినందున ఎన్నికల ప్రచారంలో కాటన్ చీరలు ధరించి పాల్గొనాలని సౌందర్య భావించి ఈ సూచన చేశారట.ఈ విషయం చెప్పి సౌందర్య తన ఫ్లైట్ కి వెళ్లిపోయింది. కానీ ఆ తర్వాత తిరిగి రాని లోకాల కు వెళ్లిపోయిందని కోడలు వెల్లడించింది. సౌందర్య ఎప్పుడూ కుంకుమ ను నుదుటిన దిద్దుకునేందుకు ఇష్టపడేది. సౌందర్యను చూడడానికి అదే చివరిసారి అని కుటుంబంలో ఎవరూ ఊహించలేదు. సౌందర్య ఆకస్మిక మరణం అసంఖ్యాకంగా ఉన్న ప్రపంచవ్యాప్త అభిమానుల్లో తీవ్ర విషాదం నింపింది. ఆ దురదృష్టకర సంఘటన తో తన కుటుంబం ఎంతగా తల్లడిల్లిపోయిందో ఊహించగలిగేదే.సౌందర్య అప్పటికే తెలుగు చిత్రసీమ లో అత్యుత్తమ నటీమణుల లో ఒకరిగా ఎదిగింది. తెలుగు తో పాటు తమిళం కన్నడ మలయాళం లోను నటిస్తోంది. సౌత్ తో పాటు హిందీ ప్రేక్షకులు కూడా సూర్యవంశంలో అమితాబ్ బచ్చన్ సరసన నటించిన సౌందర్యను ఈనాటి కీ గుర్తుంచుకుంటారు. టెలివిజన్ లో రీటెలికాస్ట్ చేయడం వల్ల ఈ చిత్రం ఎప్పటికీ అభిమానుల ను అలరిస్తూనే ఉంది. దక్షిణాది ప్రేక్షకుల మనస్సుల నుండి మాత్రమే కాకుండా బాలీవుడ్ అభిమానుల నుండి కూడా సౌందర్య ఎప్పటికీ దూరం కాలేదు.ఆమె కెరీర్ మొత్తంలో అన్ని పరిశ్రమల్లోను అనేక ప్రశంసలు అవార్డులను గెలుచుకుంది. సౌందర్య నటించిన చిత్రానికి జాతీయ ఉత్తమ చలనచిత్రం అవార్డు కూడా దక్కింది. 2002 కన్నడ చిత్రం 'ద్వీప'ను జాతీయ అవార్డు వరించింది. ఈ సినిమా ని సౌందర్య స్వయంగా నిర్మించడమే కాకుండా ఇందులో నటించింది.

## విరూపాక్ష దర్శకుడు చెప్పిన 'టికెట్' స్టోరీ



కార్తీక్ వర్మ దండు.. రెండు నెలలు గా టాలీవుడ్లో చర్చనీయాంశం అవుతున్న పేరు. ఎనిమిదేళ్ల కిందటే ఈ యువ దర్శకుడు 'భోలేనాథ్' అనే సినిమా తో దర్శకుడి గా పరిచయం అయ్యాడు. కానీ ఆ సినిమా ఫ్లాప్ అయి తన పేరు ఎవరి దృష్టిలో పడలేదు. ఆ తర్వాత చాలా గ్యాప్ తీసుకుని తన గురువు సుకుమార్ సహకారం తో సాయిధరమ్ తేజ్ హీరోగా అతను తీసిన 'విరూపాక్ష' బ్లాక్ బస్టర్ అయింది. దీంతో కార్తీక్ టాలీవుడ్లో మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్లలో ఒకడైపోయాడు. తన తర్వాతి చిత్రం పెద్ద రేంజ్ స్టార్తో ఉండొచ్చని వార్తలొస్తున్నాయి. కార్తీక్ తాజాగా నిఖిల్ సినిమా 'స్పై' ప్రి రిలీజ్ ఈవెంట్ కు అతిథుల్లో ఒకడిగా హాజరయ్యాడు. ఈ సందర్భంగా నాగచైతన్య ను ఉద్దేశించి మాట్లాడుతూ.. అతడి చిత్రం '100 పర్సంట్ లవ్' రిలీజ్ టైం లో జరిగిన ఒక ఇంట్రెస్టింగ్ ఇన్సిడెంట్ ను షేర్ చేసుకున్నాడు.తాను చందూ మొండేటి (కార్తికేయ ప్రేమమ్ కార్తికేయ-2' దర్శకుడు) అక్కినేని నాగార్జునల కు వీరాభిమానులం అని.. ఆయన తనయుడైన నాగచైతన్య అన్నా తమ కు ఇష్టమే అని తెలిపాడు. చైతూ సినిమా '100 పర్సంట్ లవ్' రిలీజ్ టైం లో థియేటర్ కు వెళ్లి టికెట్లు సంపాదించామని.. ఆ సినిమా రిలీజ్ సందర్భాన్ని పురస్కరించుకుని డ్రింక్స్ తెచ్చుకుని వేడ మీద పార్టీ చేసుకున్నామని.. ఐతే తమ పార్టీ అయ్యాక చూస్తే సినిమా టికెట్లు కనిపించలేదని..అప్పుడు ఏం చేయాలో పాలుపోలేదని తెలిపాడు. అప్పుడు తాను రీకలెక్ట్ చేసుకుంటే టికెట్ల ను అంతకుముందే విసిరిన విషయం గుర్తుకొచ్చిందని.. ముందుకెళ్లి చూస్తే టెర్రస్ మీద టికెట్లు కనిపించాయని.. అప్పుడు 'స్పై'లో నిఖిల్ లాగా సాహసం చేసి.. గోడలు దూకి ఆ టికెట్ల ను తిరిగి తెచ్చుకుని సినిమా కు వెళ్లామని కార్తీక్ గుర్తు చేసుకున్నాడు. చందూ నాగ్ కు పెద్ద ఫ్యాన్ అని గతం లోనే చెప్పాడు కానీ.. ఇప్పుడు కార్తీక్ సైతం అక్కినేని హీరో కు వీరాభిమాని అని వెల్లడైంది. 'విరూపాక్ష' సక్సెస్ నేపథ్యంలో కార్తీక్.. సుకుమార్ తేజుల నుంచి ఒక లగ్జరీ బెంజ్ కారును గిఫ్టా అందుకోవడం విశేషం.



## షారుఖ్ 'జవాన్' ఆ రెండు భాషల్లోనేనా...?



బాలీవుడ్ సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్ చాలా సంవత్సరాల తర్వాత పఠాన్ సినిమా తో సూపర్ హిట్ ను దక్కించుకున్న విషయం తెల్సిందే. వెయ్యి కోట్ల కు పైగా వసూళ్లు సాధించిన పఠాన్ సినిమా తో షారుఖ్ తదుపరి సినిమా పై అంచనాలు భారీగా పెరిగాయి. పఠాన్ కు ఏమాత్రం తగ్గకుండా జవాన్ సినిమా ఉండబోతుంది అంటూ యూనిట్ సభ్యులు చెబుతున్నారు.తమిళ దర్శకుడు అట్లీ ఈ సినిమాను రూపొందిస్తున్న విషయం తెల్సిందే. తమిళ లేడీ సూపర్ స్టార్ నయనతార ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించబోతుంది. అంతే కాకుండా తమిళ స్టార్స్ విజయ్ సేతుపతి ఇంకా పలువురు కీలక నటీనటులు మరియు కమెడియన్స్ జవాన్ సినిమాలో కనిపించబోతున్నారు.షారుఖ్ ఖాన్ 'జవాన్' సినిమాను పూర్తిగా హిందీ సినిమా అన్నట్లుగా కాకుండా తమిళ మరియు హిందీ సినిమాగా ప్రమోషన్ జరుగుతోంది. తమిళంకు చెందిన పలువురు నటీ నటులు నటించడంతో పాటు దర్శకుడు తమిళం వ్యక్తి అవ్వడం వల్ల తమిళ ప్రేక్షకులు జవాన్ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.తెలుగు లో ఇప్పటి వరకు ఈ సినిమా కు ఒక మోస్తరు బజ్ కూడా క్రియేట్ అవ్వలేదు. దాంతో సినిమా తెలుగు మార్కెట్ లో ఎంత వరకు రాబట్టగలదు అనే ఆసక్తి కొందరిలో ఉంది. పఠాన్ సినిమాను తెలుగు ప్రేక్షకులు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు.ఇతర భాషల్లో పఠాన్ సినిమా వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు చేస్తే తెలుగు లో మాత్రం నామమాత్రపు వసూళ్లనే సాధించింది. అందుకే జవాన్ సినిమా తెలుగు లో పెద్దగా బజ్ క్రియేట్ చేయలేక పోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. జవాన్ సినిమా కేవలం తమిళ మరియు హిందీ సినిమా అన్నట్లుగానే బిజినెస్ జరుగుతోంది.

## అభిరామ్ రెండవ సినిమా! సురేష్ బాబు ప్లాన్ ఏంటి?



ఎట్టకేలకు అభిరామ్ దగ్గుబాటి 'అహింస'తో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. అయితే సినిమా ఫలితం మాత్రం ఆశించిన విధంగా రాలేదు. అభిరామ్ నటుడిగా పాస్ అయిపోయాడు. కానీ షైన్ అవ్వాల్సింది చాలా ఉంది. అదంతా జర్నీలో జరిగిపోతుంది. అయితే ఇదంతా జరగాలంటే? తాను ఎంపిక చేసుకునే స్టోరీలు..దర్శకుల పై ఆధారపడి ఉంటుంది. నటుడ్ని ఆవిష్కరించేది దర్శకుడు. అతనిలో పనితనాన్ని బయటకు తెచ్చేది కెప్టెన్ మాత్రమే.కాబట్టి మజిలా సాఫీగా సాగాలంటే దర్శకుల ఎంపిక అన్నది అత్యంత కీలకం. అయితే ఆ విషయంలో యంగ్ హీరో అంత టెన్షన్ పడాల్సిన పనిలేదు. వెనుక తండ్రి సురేష్ బాబు..అన్నయ్య నటుడు రానా సహకారం ఉంటుంది కాబట్టి! మెలకువలు పట్టుకునే ఛాన్స్ ఉంటుంది. అయితే ఇది జరగాలన్నా? అభిరామ్ ఫ్యాషన్ మీదనే ఆధారపడి ఉంటుంది. కెరీర్ ని అతనెంత సీరియస్ గా తీసుకుని ముందుకు తీసుకెళ్తాడు? అన్నది చూడాలి.ఆ సంగతి పక్కనబెడితే అభిరామ్ ఇప్పుడు రెండవ సినిమా ఏ దర్శకుడితో చేస్తాడు? అన్నది ఆసక్తికరంగా మారింది. డెబ్యూని సీనియర్ దర్శకుడు తేజ చేతుల్లో పెట్టారు. కానీ అది వర్కౌట్ అవ్వలేదు. ఈనేపథ్యంలో సురేష్ బాబు ప్లాన్ మార్చేసే అవకాశం ఉంది. సీనియర్ల కన్నా కొత్త వారైతేనే బెస్ట్ అని అతను ఎప్పుడూ నమ్ము తారు. ట్రెండ్ ని ఫాలోఅయ్యే వాళ్లే యూత్ కి కనెక్ట్ అయ్యే సినిమాలు చేస్తారు అన్నది అతని నమ్మకం.అందుకే సురేష్ ప్రొడక్షన్స్ లో కొత్త వారితో సినిమాలు చేస్తుంటారు. పైగా సురేష్ బాబు చాలా అడ్వాన్స్ డ్ గాను ఆలోచిస్తారు. ఈ నేపథ్యంలో అభిరామ్ తదుపరి సినిమాకి కొత్త దర్శకుడిని తెరపైకి తెచ్చే అవకాశం ఉందని వినిపిస్తుంది.

# రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలి



కర్నూలు : రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎం.సుధాకర్ బాబు తెలియజేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కర్నూలు నగరానికి చెందిన డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ నగర అధ్యక్షులు ఎన్. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వారి అనుచరులు,డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ నాయకులు కే.నాగ శేషు, కె.వి.కృష్ణారెడ్డి,వారి అనుచరులు 25 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డిసిసి సుధాకర్ బాబు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రధాని అయిన వెంటనే ప్రత్యేక హోదా,విభజన చట్టంలోని అన్ని అంశాలను మొదటి సంతకంతో పరిష్కరిస్తారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎప్పటికైనా శాశ్వత పనులు చేపట్టాయని,ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రాజెక్టులు జాతీయ సంస్థలు కాంగ్రెస్ హయాంలో నిర్మించినవేనని, ప్రధాని మోదీ ఎన్నికల ముందు తిరుపతి వెంకటేశ్వరస్వామి సాక్షిగా హామీ ఇచ్చి మాట తప్పి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని చెప్పారు. మోడీకి కావలసింది దేశ ప్రజలు కాదని,అంబానీ,ఆదానిలు ఉంటే చాలని సుధాకర్ బాబు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులకు,కాంగ్రెస్ పార్టీ రోజు రోజుకు పుంజుకుంటున్న తరుణంలో కర్నూలు నగరానికి చెందిన యన్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషకరమైన

**ఎం.సుధాకర్ బాబు,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు**

విషయమని,వారికి,వారి అనుచరులకు పార్టీ కండువాలు వేసి సుధాకర్ బాబు పార్టీలోనికి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు సాధిస్తుందని, జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం దివాలా తీసిందని,రాష్ట్రం అప్పుల కుప్పగా తయారైందని,ఇచ్చిన హామీలు ప్రచారానికి తప్ప ప్రజలకు ఉపయోగపడటం లేదని ఆయన తెలియజేశారు. అనంతరం డిసిసి ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరడం లేదని,అధికార పార్టీ నాయకులు దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలన్నట్లు మట్టి,ఇసుక అక్రమ మార్గాల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారని,వీటిని నియంత్రించలేక ప్రభుత్వం విఫలమైందని రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర మరియు కర్ణాటక ఫలితాలతో కాంగ్రెస్ శ్రేణులలో నూతన ఉత్సాహం వచ్చిందని పేర్కొన్నారు. నిత్యవసర ధరల నియంత్రణలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వం విఫలమయ్యాయని, సత్యనారాయణ గుప్త విమర్శించారు. అనంతరం పార్టీలో చేరిన ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏదైనా శాశ్వత పనులు కావాలన్నా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అలాంటి కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికలలో తప్పక అధికారం చేపడుతుందని, గతంలో చేసిన అభివృద్ధి పనులకు ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. అనంతరం కే. నాగశేషు మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల ఫలితాల అనంతరం దేశంలో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందని,పక్క రాష్ట్రం తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ గుప్త,ఐఎన్ టియుసి జిల్లా అధ్యక్షులు బి. బతుకన్న,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎన్.సి.బజారన్న,మహిళా కాంగ్రెస్ సిటీ అధ్యక్షురాలు ఎస్.ప్రమీల,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీలపై రూ కోట్ల ఏ.సి.డి. అదనపు భారం రద్దు చేయాలి



కర్నూలు :కరోనా నుండి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలపై విద్యుత్ శాఖ విధించిన ఏసిడిని రద్దు చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రతినిధి బృందం విద్యుత్ శాఖ ఎస్.ఈని కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి నగర నాయకులు కె.గోపీనాథ్ మాట్లాడుతూ ఇప్పటికే డెవలప్ మెంట్ చార్జీ,ట్రూ ఆఫ్ చార్జీ పేరుతో భారం వేశారన్నారు. మళ్లీ కరెంటు చార్జీపై 100శాతంపైగా ఏసిడితో బిల్లులు ఇచ్చారని,మొత్తం చెల్లిస్తేనే కరెంటు బిల్లులు సేకరిస్తామని, వినియోగదారులను వెనక్కి పంపడం సరైందికాదని విమర్శించారు. బక్రీద్ పండుగపై కూడా రాష్ట్ర ప్రభుత్వం కనికరం చూపడం లేదని ఆవేదన చెందారు. 8311201195421 సర్వీసు నంబర్ గల నివాస భవనానికి రూ.21432 కరెంటు బిల్లు వస్తే దానిపై రూ.31850 ఏసీడీ బిల్లు కలిపి కరెంటు బిల్లు వచ్చిందని ఉదాహరణగా తెలిపారు. కరెంటు బిల్లుతోపాటు ఏసీడీ చెల్లిస్తే తప్ప ఫోన్ పే ఆన్లైన్లో చెల్లింపులు స్వీకరించకపోవడం,ఇదెక్కడి న్యాయమని ఎని ప్రశ్నించారు. విద్యుత్ భారాలు రద్దు చేయకపోతే ఆందోళన చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎస్.ఈ మాట్లాడుతూ ఏసిడి రద్దు చేయడం నా పరిధిలో లేదని, అర్జీని

**.రూ.21వేల కరెంటు బిల్లుపై రూ 31వేలకు పైగా ఏసిడి.**
**బక్రీద్ పండగపై కనికరం చూపని ప్రభుత్వం**
**విద్యుత్ బిల్లుతోపాటు ఏసిడి చెల్లించని వినియోగదారులను వెనక్కు పంపుతున్న దుస్థితి**
**ఏసిడీ చెల్లించకపోతే కరెంటు బిల్లును ఫోన్ పే,ఆన్లైన్లు స్వీకరించకపోవడం న్యాయం?పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆవేదన15రోజుల్లో ఏసిడి చెల్లిస్తామని వ్రాసిస్తే సమయం ఇస్తాం.ఎస్.ఈ.**

ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని అన్నారు. అయితే ప్రస్తుతం 15రోజులకు చెల్లిస్తామని రాసి ఇస్తే ఏసిడీ చెల్లింపుకు సమయం ఇస్తామని పేర్కొన్నారు. ఎస్ ఈని కలిసిన ప్రతినిధి బృందంలో ఎన్.మదిలేటి,ఎం.డి.జైభాషా ఎస్ షాకీర్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ విఫలం...యువకుడు ఆత్మహత్య

**మురళీధర్ రెడ్డి,మూడవ పట్టణ సిఐ**



కందనవోలు,కర్నూలు క్రైం :కర్నూలు నగరంలో బిర్లాగేట్,పోస్టాఫీస్ ప్రాంతంలో గురువారం యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగినట్లు మూడవ పట్టణ సిఐ మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. సిఐ తెలిపిన వివరాలు... కర్నూలు నగరం,బిర్లాగేట్, పోస్టాఫీస్ ప్రాంతంలో బోయ మధు (25) గత నాలుగు సంవత్సరాల నుండి ఒక అమ్మాయి ప్రేమిస్తూ ఉన్నాడని అన్నారుఆమె అతని ప్రేమను తిరస్కరించినందున, జీవితముపై విరక్తి చెందినట్లు పేర్కొన్నారు. చనిపోవాలనే ఉద్దేశ్యంతో తన ఇంటి ప్రక్కలోని ఖాళీగా వున్న రేకుల షెడ్ లోని ఇనుప పైపుకు దుప్పటితో వురి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు చెప్పారు. కుటుంబ సభ్యులు బోయ విజయ్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సిఐ తెలిపారు.

# జగనన్న సురక్ష 21వ వార్డు ప్రజలకు విజ్ఞప్తి

నంద్యాల జూన్ 29జగనన్న సురక్ష అర్హులైన లబ్ధిదారులందరికీ అవసరమైన అన్ని సంక్షేమ పథకాలను అందించే లక్ష్యంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారు రూపొందించిన " జగనన్న సురక్ష కార్యక్రమం" లో భాగంగా నూనెపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ పక్కన ఉన్న 21 వ వార్డు సచివాలయం (నూనెపల్లి హరిజనవాడ) దగ్గర ప్రత్యేక క్యాంప్ ను 2023 జులై 01వ తేదీ శనివారం ఉదయం 9 గ.ల నుండి సాయంత్రం 5 గ.ల వరకు ఏర్పాటు చేయడమైనది. కావున , వార్డు ప్రజల అందరూ పాల్గొని సంక్షేమ పథకాల వలన కలుగు లబ్ది కొరకు అవసరమగు ధృవీకరణ పత్రాలను ఈ ప్రత్యేక క్యాంప్ లో పొందగలరని తెలియజేయడమైనది. ఈ క్యాంప్ లో లబ్దిదారులు కోరిన కుల, నివాస ధృవీకరణ సర్టిఫికెట్లతో పాటు ఆదాయ ధ్రువీకరణ, జనన మరియు మరణ ధృవీకరణ, మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, మ్యుటేషన్ ఫర్ కరక్షన్స్, మ్యారేజ్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్, కౌలు రైతుల గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ),

కొత్త రేషన్‌కార్డు లేదా రేషన్‌కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో సభ్యుల పేర్ల తొలగింపు మొదలగు 11 రకాల సేవలకు సంబందించిన ధృవీకరణ పత్రాలను ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా ఈ క్యాంప్ లో జారీ చేయడం జరుగుతుంది. అర్హత ఉండి ఎవరైనా నమోదు చేసుకోని యెడల క్యాంప్ రోజు వచ్చి నమోదు చేసుకోవచ్చు. అటువంటి వారికి మరలా ఒకరోజు క్యాంప్ ఏర్పాటు చేసి సంబంధిత ధృవీకరణ పత్రాలను అందజేయడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి అన్నారు

# పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా



కర్నూలు జిల్లా పరిషత్ :కర్నూలు నగరంలోని 23వ వార్డు, శ్రీరాంనగర్ లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కరెంటు చార్జీలు తగ్గించాలని కోరుతూ గురువారం కరపత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమం సందర్భంగా సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు ప్రజలకు పెరిగిన కరెంటు చార్జీల గురించి వివరిస్తూ మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తోడుదొంగల వలె కరెంటు చార్జీలు పెంచి ప్రజలకు షాకు ఇస్తున్నారు. గత సంవత్సరం కరెంటు చార్జీలు పెంచి రూ.1400 కోట్ల భారం మోపినట్లు చెప్పారు. స్లాబులు మార్చేశారు. ప్రజల కళ్ళుగప్పి గత 15ఏళ్ల నుంచి వాడుకున్న కరెంటు బిల్లులు కట్టినా మళ్లీ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల పైన తాజాగా రూ.6000 కోట్ల భారం వేశారన్నారు. జగన్ ప్రభుత్వం పాలించిన ఈ నాలుగు సంవత్సరాల కాలంలో రూ.25 వేల కోట్ల భారాలు ప్రజలపై మోపారు. ఈనెల బిల్లులో 2014సంవత్సరంలో వాడుకున్న కరెంటుకు మళ్ళీ యూనిట్ పై 20 పైసలు,2021,మే నెలలో వాడిన విద్యుత్ యూనిట్ కు మరో 20 పైసలు,2023, ఏప్రిల్ నెలలో ఉపయోగించిన కరెంటుకు యూనిట్ కు రూ.40 పైసలు కలిపి మొత్తం యూనిట్ కు 80 పైసలు చొప్పున జనం నెత్తిన బండ వేశారని ఆగ్రహం చెందారు. గతంలో విద్యుత్ ఛార్జీలు పెంచడం అంటే రెండేళ్లకు,లేదా మూడేండ్లకు ఒకసారి పెంచేవారు. కానీ కేంద్ర ప్రభుత్వానికి లొంగిపోయిన జగన్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం వంటగ్యాస్ ధర పెంచిన విధంగా ప్రతి సంవత్సరం కరెంటు చార్జీలు పెంచుతున్నారని అన్నారు. కరెంట్ బిల్లులో వాడిన దాని కంటే ఫిక్స్ చార్జీలు,కస్టమర్ చార్జీలు, సర్ చార్జీలు విద్యుత్ సుంకం సర్దుబాటు చార్జీలు,ఇలా రకరకాల పేర్లు పెట్టి ఎక్కువ ఛార్జీలు వేసి జనాన్ని పీల్చి పిప్పి చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచంలో కరెంటు చార్జీలు తగ్గాయి. గతంలో సోలార్ విద్యుత్ యూనిట్ రూ.12 ఉండగా ఇప్పుడు ఉత్పత్తి ఖర్చు తగ్గి రెండు రూపాయలకు రేటు పడిపోయింది. ఉత్పత్తి ఖర్చు తగ్గింది కాబట్టి కరెంటు చార్జీలు తగ్గాలి,కానీ ఆ విధంగా కాకుండా కరెంటు చార్జీలు పెంచుతున్నారు. అదాని,అంబానీ వంటి వాడికి విద్యుత్ రంగాన్ని అప్పజెప్పడం వల్ల నేడు స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై ప్రతి వినియోగదారునికి రూ.13వేలు భారం పడేవిధంగా స్మార్ట్ మీటర్లను తీసుకొస్తున్నారని,దీనిని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు విద్యుత్ ఛార్జీలు పెంచినప్పుడు,సిపిఎం పార్టీ, వామపక్ష పార్టీలన్నీ కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేయడం వల్ల అప్పటి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడానికి భయపడి 10సంవత్సరాలపాటు పెంచలేదన్నారు. ఆ విజయం సిపిఎంపార్టీ,వామపక్షపార్టీలు,ప్రజల యొక్క పోరాట ఫలితం అని చెప్పుకోవచ్చు అన్నారు. అదాని, అంబానీ,వంటి కార్పొరేట్ శక్తులకు లొంగిపోయిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా కరెంటు చార్జీలు తగ్గాలంటే ప్రజలందరూ వామపక్ష పోరాటాలకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నేడు కొత్తబస్టాండ్,విద్యుత్ భవన్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని జరుగుతున్న ధర్నాలో ప్రజలందరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు ఎస్. శేషంరాజు,ఎస్.అజ్మత్,ఎం.హనుమంతు,వై.నరసింహులు, ఎన్.పాండు,తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన గూడూరు శాసనసభ్యులు వెలుగు పల్లి వర ప్రసాదరావు

గూడూరు , తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గ గూడూరు నియోజకవర్గ ముస్లిం సోదర సోదరీమణులందరికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి మరియు వైసీపీ పార్టీ నాయకుల తరఫున బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన గౌరవ శాసనసభ్యులు డాక్టర్ శ్రీ వెలగపల్లి వరప్రసాద్ రావు గూడూరు పట్టణంలోని పెద్ద మసీదు నందు ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ లో పాల్గొన్న



ఎమ్మెల్యే గూడూరు నియోజకవర్గ ప్రజలు ఎంతో పెద్ద ఎత్తున మమ్మల్ని ఆదరించడం జరిగింది, అందులో ముఖ్యంగా ముస్లిం మైనార్టీల సోదరులు జగన్మోహన్ రెడ్డి గారిని ఎంతగానో ఆదరించి వైఎస్ఆర్సిపి పార్టీని అధికారంలోకి తీసుకొని రావడం జరిగింది.. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోమిడి శ్రీనివాసులు, ముస్లిం మైనారిటీలు అజిజ్ ఖాన్, జిలానీ బాషా, బాబా భాయ్, అల్తఫ్, సందని, అహమద్ బాషా, షబ్బీర్, మదర్ మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# కలెక్టర్ పేరు చెప్పి ఉద్యోగాల ఎర

**ఖజానా శాఖలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులంటు డబ్బులు వసూళ్లు**
**రోజురోజుకు రెచ్చిపోతున్న దళారీ వ్యవస్థ**
**డబ్బులు గుంజడం,తప్పించుకు తిరగడం వీరి దందా**
**ప్రశ్నిస్తే రాజకీయ నాయకుల పేరుతో బెదిరింపులు**

కర్నూలు ప్రతినిధి :ట్రెజరీలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కేవలం రూ.4,40 లక్షలు ముందే కట్టాలి. ఒక నెలలో వెరిఫికేషన్,రెండో నెలలో అప్పాయిట్ మెంట్. రెవిన్యూ ఉద్యోగి సృజన పర్సనల్ గా లోలోపల బర్తీ చేస్తున్నారు. ఇందులో ఒక ఎం.అర్.ఒ హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులు సిద్ధం చేసుకోండి. ఉద్యోగం ఇప్పిస్తానని కర్నూలు నగరం,బి.క్యాంప్ లో ఉంటున్న వైడూర్య అనే ఒక అమ్మాయి తనకు తెలిసిన వారికి చెపుతూ ఉద్యోగాల ఎర వేస్తుంది. విషయం తెలుసుకున్న కంజ్యుమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు కిషోర్ కుమార్ పరిశీలనలో వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారం నగరంలో ఉద్యోగాల పేరుతో ప్రజలను నిట్టనిలువుగా దోపిడీ చేస్తున్నారో ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఈ విషయంలో కిషోర్ కుమార్ తనకు ఏమి తెలియనట్లుగా ఒక ఉద్యోగం కావాలని ఫోన్ ద్వారా వైడూర్య అనే అమ్మాయిని సంప్రదించాడు. తనుకలెక్టర్ కార్యాలయంలోనే ట్రెజరీలో సీనియర్ అసిస్టెంట్ గా చేస్తున్నానని,ఇది చాలా గోప్యంగా జరుగుతున్నాయని గత బుధవారం చివరి రోజు కావున ముందుగా ఒక ఫోటో,డిగ్రీ మార్క్స్ మెమో జిరాక్స్,ఆధార్ కార్డ్,రూ.834 అప్లికేషన్ పేమెంట్ ఇస్తే,కుమారి అనే మేడంకు చెప్పి ఫార్వర్డ్ చేయిస్తామని, మధ్యాహ్నం లోపల రూ.4.40 లక్షలు ఇవ్వాలని,ఇందుకోసం నమ్మకం కోసం ఒక బాండ్,చెక్ రాసిస్తానని,ఉద్యోగం గ్యారంటీ అని కిషోర్ కుమార్ తో అప్లికేషన్ అమౌంట్ ను ఫోన్ పే ద్వారా తీసుకుంది. పూర్తి సమాచారం తెలుసుకున్న అనంతరం కిషోర్ కుమార్ తన హోదాను తెలియచేసి,మహిళ వైడూర్యను నిలదీశాడు. ఉద్యోగాల పేరుతో ప్రజలను మోసం చేయడం చాలా తప్పని,పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించడం జరిగింది. దీంతో కంగారుచెందిన మహిళా తప్పించుకునేందుకు నేను ఎవరికీ మోసం చేయలేదు నన్ను క్షమించండి. అంతకుమారి అనే మహిళనే ఉద్యోగాలుఉన్నాయని,తనకు కలెక్టర్,జేసిలు,ఉన్నత స్థాయి అధికారులతో సాన్నిహిత్యం ఉందని,ఎవరైనా ఉంటే చెప్పు అని నమ్మబలికిందని దానితో నేను ఇలా చేస్తున్నానని పోలీసులకు ఫిర్యాదు చేయవద్దు అంటూ వేడుకుంది. కుమారిపై ఫిర్యాదు చేయడం వద్దు,మా ఇద్దరినీ వదిలేయండి. ఇంకెప్పుడు ఇలా చేయం అంటూ బతిమాలుకుంది. ఈ వ్యవహారంలో ప్రభుత్వ యంత్రాంగం చొరవ చూపి ఉద్యోగాల పేరుతో ఇలాంటి దోపిడీలకు పాల్పడుతున్న దళారీ వ్యవస్థ కట్టడిచేసేలా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, నిరుద్యోగులు కోరుతున్నారు. కానీ ఇలాంటి మోసాలు చేసేవాళ్ళు కర్నూలు నగరంలో పుట్టగొడుగుల్లా రెచ్చిపోతున్నారని,వీరి దోపిడీకి రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని ప్రజలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ప్రభుత్వాలు మారిన ఉద్యోగాల పేరుతో జరుగుతున్న దోపిడీ వ్యవస్థకు కళ్లెం వేయలేకపోతున్నాయని ఆగ్రహం చెందుతున్నారు. అమాయకుల ద్వారా ఇప్పటి వరకు ఎంత దోచుకున్నారో... ఎంత మంది జీవితాలు నాశనం అవుతున్నాయో అర్థం చేసుకుని ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలో జరుగుతున్న మోసంపై కిషోర్ కుమార్ మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

## మహానంది క్షేత్రంలో ఘనంగా తొలి ఏకాదశి పూజలు

మహానంది:- మహానంది క్షేత్రంలో ఘనంగా తొలి ఏకాదశి పూజలను నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఒకరోజు ముందుగానే బుధవారం ఆలయ శుద్ధి చేశారు. శాస్త్ర యుక్తంగా వేద మంత్రాలు మంగళ వాయిద్యాల మధ్య క్షేత్రంలో తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం క్షేత్రంలో ప్రత్యేక పూజలతో తొలి ఏకాదశి పూజలు భక్తుల సమక్షంలో నిర్విఘ్నంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహానంది దేవస్థానం ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి దంపతులతో పాటు ఆలయ పాలకమండలి సభ్యులు గంగిశెట్టి మల్లికార్జున వేద పండితులు రవిశంకర్ అవధాని, శాంతారామ్ భట్, నాగేశ్వర శర్మ పాల్గొన్నారు. కానీ ఆలయ చైర్మన్ మరియు ఇతర పాలకమండలి సభ్యులు తొలి ఏకాదశి పూజలో పాల్గొనక పోవడం చర్చనీయాంశంగా మారింది





EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**